PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి:42 సంచిక:231 | విజయవాడ, శనివారం 25 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల: 5.50

Vol No | Vijayawada, Saturday 25 March 2023 | Rs



రేపు నింగిలోకి 'ఎల్‌వీఎం3-ఎం3'

- నేటి నుంచి కౌంట్‌డౌన్

లోపలి పేజీలో..



విశాఖలో సినీ తారల క్రికెట్ సందడి

- సిసిఎల్ ఫైనల్‌కు భోజ్‌పురి దబాంగ్స్

లోపలి పేజీలో..

రాహుల్‌పై అనర్హత వేటు



- ప్రతిపక్షాలపై దాడికి క్రిమినల్ రూటు ఎంచుకున్న బిజెపి : సీతారాం ఏచూరి
- అలా అయితే దేశ ప్రతిష్టనే దెబ్బతీస్తున్న బిజెపిపై ఎన్ని కేసులు పెట్టాలి: అఖిలేష్
- దొంగలు, బందిపోట్లకు స్వేచ్ఛ..., రాహుల్‌కు శిక్షా!: ఉద్ధవ్
- రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతాం : ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాలు లక్ష్యంగా మోడీ ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశత్వ దాడులు మరింత వికృత రూపం దాల్చాయి. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంటరీ సభ్యత్వాన్నే తొలగించేసింది. పరువునష్టం పేరుతో మోడీ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దాడిని ప్రతిపక్షాలు ముక్త కంఠంతో ఖండించాయి. ఈ దాడులను తిప్పికొట్టాలని, ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చాయి. కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం శుక్రవారం అనర్హత వేటు వేసింది. దీనికి సంబంధించి లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి శుక్రవారం ఉదయం సర్క్యులర్ జారీ అయింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8(3) ప్రకారం రాహుల్‌పై అనర్హత వేటు వేస్తున్నట్లు తెలిపింది. పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు తీర్పు ఇచ్చిన 24 గంటల్లోనే లోక్‌సభ సెక్రటేరియట్ రాహుల్‌పై వెంటనే చర్యలకు దిగడం విశేషం. "కేరళలోని వాయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీని సూరత్ కోర్ట్ ఆఫ్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దోషిగా తేల్చడంతో లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. దోషిగా తేలిన 2023 మార్చి 23 నుంచి నుంచి అనర్హత వర్తిస్తుంది. రాజ్యాంగం ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 8లోని ఆర్టికల్ 102(1)(ఈ) ప్రకారం నిర్ణయం తీసుకున్నాం" అని పేర్కొంటూ లోక్‌సభ సెక్రటరీయేట్ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సర్క్యులర్ జారీ చేశారు. కాగా, ఆర్టికల్ 103 ప్రకారం ఇలాంటి వివాదాల్లో అంతిమ నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రపతి ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం శిక్షపడిన ప్రజా ప్రతినిధికి శిక్షాకాలంతో పాటు మరో ఆరేళ్లు పోటీ చేయడానికి వీలులేదు.ప్రజా ప్రతినిధులకు శిక్ష పడిన వెంటనే అప్పీలకు వెళ్లకుండా అమలులోకి వస్తుందని 2013లో అప్పీలకు వెళ్లకుండా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే దీనిని నిలుపుదల చేసి, అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం ఇస్తూ నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆ ఆర్డినెన్స్ కాపీలను అప్పటి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చించివేశారు. దాంతో ఆర్డినెన్స్ నిలిచిపోయాయి. నాడు ఆర్డినెన్స్ చట్టంగా మారి ఉంటే, ప్రస్తుతం రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడకుండా అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండేది. కానీ ఆర్డినెన్స్ ఆమోదించకపోవడంతో రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు అవకాశం లభించింది.


చట్ట ప్రకారం ముందుకు : ఖర్గే

రాహుల్‌పై సూరత్ కోర్ట్ ఇచ్చిన తీర్పుపై చట్ట ప్రకారం ముందుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మ్లలికార్జున ఖర్గే చెప్పారు. బిజెపి ఇలా చేస్తుందని తాము ముందే ఊహించామన్నారు. రాహుల్ నోరు నొక్కడానికే ఇలా చేశారని విమర్శించారు. తన సోదరుడు భయపడే రకం కాదని, భయపడబోడని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ అన్నారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భాగేల్, రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్ కూడా బిజెపి మిగతా 2లో

జవాబుదారీ జాడేదీ?

- పద్దుకు బద్ధులై ఉండక్కర్లేదా?
- మూడేళ్లలో రూ.7788 కోట్లు పెరిగిన మద్యం ఆదాయం

కాగ్ అక్షింతలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్లో చూపించకుండా నిధులను ఖర్చు చేస్తుండటం వల్ల బడ్జెట్‌పై అసెంబ్లీ నియంత్రణ సడలుతోందని కాగ్ అక్షింతలు వేసింది. పెట్టుబడి ఖర్చులు క్రమంగా తగ్గించుకుంటూ వస్తుండటంతో దీర్ఘకాల అభివృద్ధి కుంటుపడుతోందనీ పేర్కొంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ నివేదికను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అడిగిన సమాచారం ఇవ్వడానికి వివిధ శాఖలు విముఖత చూపడం వల్ల అందుబాటులో ఉన్న వివరాలతో నివేదిక రూపొందించామని, గత ఏడాదితో పోలిస్తే చెల్లించాల్సిన రుణాలు రూ.24,257 కోట్లకు చేరాయని, బడ్జెటేతర రుణాలు 1,18,394 కోట్లని పేర్కొంది. డిస్కమ్‌లు, జల ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.17,804 కోట్లుగా పేర్కొంది. పలు విభాగాలకు చెందిన బకాయిలను బడ్జెట్లో చూపలేదని తెలిపింది. 2017-18లో రూ.10,820 కోట్లుగా ఉన్న జిఎస్‌టి వసూళ్లు 2019-20 నాటికి రూ.20,227 కోట్లకు చేరుకున్నాయి. 2021-22 సంవత్సరంలో రూ.18,872 కోట్లు వసూలవగా 2021-22లో 23,809 కోట్లకు చేరుకుందని వృద్ధిరేటు 18.47 శాతంగా నమోదైందని వివరించింది. పలు రెవెన్యూ అదాయాలను కూడా క్యాపిటల్ ఆదాయాలుగా చూపించారని తెలిపింది. గతేడాది ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితిని సవరించినా తీసుకున్న రుణాలు పరిమితిని దాటాయని కాగ్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఇవ్వాల్సిన వాటా నిధులు రూ.3540 కోట్లు విడుదల చేయలేదని తెలిపింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అప్పులు రూ.3,72,503 కోట్లని వివరించింది. 2018 నుండి 2022 వరకు అంతర్గత రుణాలు 77.54 శాతం పెరిగాయని, గత ఐదేళ్లలో తలసరి రుణం 61 శాతానికి చేరు కుందని తెలిపింది. బడ్జెటేతర రుణాలు కలిపితే తలసరి రుణభారం రూ. 92,797 కోట్లని పేర్కొంది. వచ్చే ఏడేళ్లలో రూ. 1,29,817 కోట్ల అప్పులు తీర్చాలని వివరించింది. ఐదేళ్లలో రెవెన్యూ రాబడి రుణేతర వసూళ్లు రూ.1,05,113 కోట్ల నుండి రూ.1,52,661 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. అంతర్గత రుణాలు వేజ్ అండ్ మీన్స్ ఐదేళ్లలో రూ.27,256 కోట్ల నుండి రూ.48,388 కోట్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు.

సొంత నిధులపై దృష్టి పెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక ఆర్థిక అభివృద్ధి పథకాల నిధుల కోసం అదనపు రెవెన్యూ వనరులను సమకూర్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని కాగ్ తెలిపింది. ఆస్తుల కల్పన కోసం మూలధన వ్యయాన్ని పెంచాలనీ, రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చే ముందు సంస్థ రుణాలు తీర్చే సామర్థ్యాన్ని లెక్కించాలని, హామీలు ఇచ్చిన సంస్థల ఆడిట్ నిర్వహించిన ఖాతాలను సమర్పించిన హామీలను, అప్పులను అంచనా వేయాలని సూచించింది. 2021- 22 సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు లేకుండానే 19 కేసుల్లో రూ.2,812 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2021-22 సంవత్సరంలో రూ.2,34,657 కోట్ల వాస్తవ కేటాయింపులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,13,788 కోట్ల అనుబంధ కేటాయింపులను చేసిందని, వాటిల్లో రూ.1,06,205 కోట్ల వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సుల చెల్లింపుల కోసం కేటాయించారని కాగ్ పేర్కొంది. మొత్తం 30 కేసుల్లో రూ.38,955 కోట్ల మిగుళ్లకు రూ.29,221 కోట్లను మాత్రమే సరెండర్ చేశారని రూ.9733 కోట్ల మిగులు నిల్వలు సరెండరు చేయలేదని వెల్లడైనట్లు వివరించింది. వ్యక్తిగత డిపాజిట్లకు సంబంధించి రూ.11,237 కోట్లను సర్దుబాటు చేశారని, వాటికి తగిన పత్రాలు కనిపించలేదని పేర్కొంది. పిఎఫ్ ఖాతాల నుండి రూ.413.73 కోట్లను సిఎఫ్‌ఎంఎస్ ద్వారా వెనక్కు తీసుకుందని పేర్కొంది. పొరపాటు వల్ల జరిగినట్లు ప్రభుత్వం వివరణ ఇచ్చిందనీ తెలిపింది. దీనివల్ల స్పష్టత పారదర్శకత లోపించిందని తెలిపింది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి రూ.3,199 కోట్లు గతేడాదితో పోలిస్తే రూ.23.35 కోట్లు తగ్గిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.1898 కోట్లు కేంద్రం నుండి వచ్చాయని, గతేడాదితో పోలిస్తే 15.06 శాతం తక్కువని పేర్కొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన క్యాపిటల్ పద్దుల కింద రూ.1,51,349 కోట్లు, అడ్వాన్సుల పద్దులోఉన్న రూ.28,099 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులు రూ.4474 కోట్లు పంపిణీ జరగలేదని తెలిపింది. మూలధన పద్దుల్లో పంపకం కాని రూ.87,707 కోట్లు భారీ నీటిపారుదలశాఖకు చెందినవని, రుణాలు, అడ్వాన్సుల పద్దులో ఉన్న రూ.13,182 కోట్లు గృహ నిర్మాణశాఖవని కాగ్ నివేదికలో పేర్కొంది.

కాగ్ నివేదికలోనూ తప్పులు

నివేదికలో అనుబంధం 2.2లో బడ్జెటేతర రుణాలకు సంబంధించిన పట్టికలో పలు తప్పులు చోటుచేసుకున్నాయి. వివిధ సంస్థలు తీసుకున్న రుణాలకు సంబంధించి మార్చి 2020 నాటికి తీసుకున్న రుణాలు అంటూ మూడు వరుసల్లోనూ అదే పొందుపరిచింది. వాస్తవంగా అది మార్చి 2020, మార్చి 2021, మార్చి 2022 అని ఉండాలి.



నలుగురు ఎమ్మెల్యేలపై వైసిపి వేటు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ఎఫెక్ట్
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో విప్ ఉల్లంఘించినందుకు నలుగురు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా విప్‌ను ధిక్కరించినందున వైసిపి క్రమశిక్షణా సంఘం సిఫార్సుల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. తమ పార్టీకి చెందిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిపై అంతర్గత విచారణ జరిపామని చెప్పారు. ఈ నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు పార్టీ గుర్తించిందన్నారు. విచారణ తర్వాతే నలుగురిపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు తమ పార్టీ ఎమ్మెల్యేలను కొన్నారని సజ్జల ఆరోపించారు. కోట్లాది రూపాయలుచేతులు మారినట్లు తెలిసిందన్నారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు ఆఫర్ చేశారని చెప్పారు. క్రాస్ ఓటింగ్ చేసినవారికి టికెట్ కూడా ఇస్తామని టిడిపి చెప్పి ఉండవచ్చునని వివరించారు.

అమానుషం

- దళిత యువకుడిని కొట్టిచంపిన పెత్తందార్లపై చర్యలు తీసుకోవాలి
- శృంగవృక్షం, తొండంగిలో బాధితులకు వి.శ్రీనివాసరావు పరామర్శ





తొండంగిలో మృతుడు రాము కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, (ఇన్‌సెట్‌లో) క్షతగాత్రుడి గాయాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షంలో పెత్తందారులు దళితుల ఇళ్లపైకి వచ్చి దాడి చేయడం అమానుషమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. దళిత యువకుడిని కొట్టి చంపిన నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొండంగిలో మృతుడు నడిపల్లి రాము కుటుంబాన్ని, శృంగవృక్షంలో తీవ్రంగా గాయపడిన దళిత యువకులను శుక్రవారం ఆయన పరామర్శించారు. రాము తల్లిదండ్రులు గంగ, నాగేశ్వరరావులను ఓదార్చారు. రాము మంచి వాలీబాల్ క్రీడాకారుడని, డిగ్రీ వరకు చదువుకుని పోలీసు ఉద్యోగానికి ప్రయత్నం చేస్తున్నాడని ఈ సందర్భంగా స్థానికులు శ్రీనివాసరావుకు తెలిపారు. జాతరలో రాముని కిందపడేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా బీరు బాటిల్‌తో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనది ఈ ఊరు కాదని, విడిచిపెట్టండని బతిమలాడినా వినకుండా కొట్టి చంపారని కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులకు శిక్షపడే వరకూ ఐక్యంగా పోరాడాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. సిపిఎం, ప్రజా సంఘాలు అండగా ఉంటాయన్నారు. వివాదం సద్దుమణిగిన తర్వాత కూడా పెత్తందారులు శృంగవృక్షంలోని దళితపేటలోకి చొరబడి విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులకు శిక్షపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నియోజకవర్గానికి చెందిన మంత్రి దాడిశెట్టి రాజా మిగతా 2లో

ఎస్‌సిలుగా దళిత క్రైస్తవులు

- ఎస్‌టి జాబితాలో బోయ, వాల్మీకులు
- కేంద్రానికి 2 తీర్మానాలు పంపుతున్నామన్న సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితులు క్రైస్తవ మతంలోకి మారినా వారికి ఎస్‌సి హోదా ఉండే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలని, బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను శాసన సభ శు క్రవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తీర్మానాలను ఆమోదించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. దళితులు క్రైస్తవ మతంలోకి మారినా ఎస్‌సి హోదా ఇవ్వాలన్న బిల్లును మంత్రి మేరుగ నాగార్జున ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డు కులాల వ్యక్తులు సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిక్కు, భౌద్ధ మతంలోకి మారిన వారితో సమానంగా పరిగణించేందుకు వారు అర్హులని చెప్పారు. హిందూ మతానికి చెందిన షెడ్యూల్డు కులాల వారు, క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్డు కులాల వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు ఒకేలా ఉన్నాయని తెలిపారు. సమాజంలో అవమానాలు, వివక్షకు గురవుతున్నారని, ఒక వ్యక్తి మరొక మతంలోకి మారడం ద్వారా వీటిలో ఏదీ మారదని, ఒక వ్యక్తి ఏ మతాన్ని ఆచరించాలనేది ఆ వ్యక్తి ఎంపిక అని, కుల నిర్ధారణపై ఎటువంటి ప్రభావం చూపకూడదని సిఎం పేర్కొన్నారు.

ఎస్‌టిల జాబితాలో బోయ, వాల్మీకులు

బోయ, వాల్మీకులను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చేందుకు తాము వేసిన వన్‌మ్యాన్ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందన్నారు. అనంతపురం, కర్నూలు, వైఎస్‌ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో నివసిస్తున్న బోయ, వాల్మీకి వర్గాలను దాని అన్ని పర్యాయపదాలతోపాటు (వాల్మీకి, చుండినవాకులు, దొంగబోయ, దొరలు, గెంటు, గురికార, కళావతి బోయలను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని సభ తీర్మానించింది. ఈ బిల్లును బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రవేశపెట్టారు. విజయవాడలో రూ.268 కోట్ల వ్యయంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని, ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి మేరుగ నాగార్జున ప్రతిపాదించిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాష్ట్రపతి భవన్‌కు ప్రతిపక్షాల మార్చ్
- పలువురు ఎంపీల అరెస్టు



రాష్ట్రపతి భవన్‌కు మార్చ్ నిర్వహిస్తున్న ప్రతిపక్ష ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు ముక్తకంఠంతో ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, అధిక ధరలు, పంటలకు మద్దతు ధర వంటి సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష నాయకులను వేధించడమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాన పనిగా పెట్టుకుందని విమర్శించారు. భారతీయ స్టేట్‌బ్యాంకు, జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి) వంటి సంస్థల నుంచి రూ.వేలాది కోట్లు రుణాలు తీసుకొని వాటిని నిర్వీర్యం చేసిన అదానీ గ్రూపు సంస్థల అధినేత గౌతమ్ అదానీ అక్రమాలపై తక్షణమే సంయుక్త పార్లమెంటీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై కేంద్ర సంస్థలను ఉసిగొల్పి సాగిస్తున్న అణిచివేత చర్యలను విడనాడాలని నినదించారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ శుక్రవారం ఇవే అంశాలపై చర్చకు పట్టుబడ్డ ప్రతిపక్షాల సభ్యులు అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడం సభను బహిష్కరించి రాష్ట్రపతి భవన్‌కు మార్చ్ చేపట్టారు. 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అని రాసివున్న బ్యానర్ పట్టుకొని ర్యాలీకి వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. ఎస్‌బిఐని రక్షించండి, ఎల్‌ఐసిని రక్షించండి..అదానీ అక్రమాలపై జెపిసి వేయండి అని రాసివున్న ప్లకార్డులను సభ్యులు చేతబట్టి ర్యాలీలో పాల్గొన్నారు. పార్లమెంట్ నుంచి ప్రదర్శనగా వెళ్లిన ఎంపిలను విజయ్ చౌక్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పలువురు ఎంపీలను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మార్చ్ ముందుకు కదలనీయకుండా చేసేందుకు మహిళా పోలీసులను పెద్ద సంఖ్యలో బారికేడ్ల వద్ద మోహరింపజేశారు. ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాలు భారీ సంఖ్యలో తరలిరావడం కాకుండా అడుగడుగునా వందల సంఖ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ అడ్డంకులన్నిటినీ అధికమిస్తూ మార్చ్ విజయ్‌చౌక్ వరకూ సాగింది. అక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిఆర్‌ఎస్, ఆప్, డిఎంకె, శివసేన, ఎస్‌పి, జెడియు తదితర పార్టీలు ఎంపిలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మాత్రం ర్యాలీకి దూరంగా ఉండటం గమనార్హం. దేశాన్ని దోచుకున్న లలిత్ మోడీ, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ గురించి ప్రధాని ఒక్క మాట కూడా అనడం లేదని, స్పీకర్‌కు లేఖ ఇచ్చినా రాహుల్ గాంధీని లోక్‌సభలో మాట్లాడేందుకు అనుమతించలేదని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. దేశంలో మిగతా 5లో

సిబిఐ, ఈడి దుర్వినియోగంపై సుప్రీంను ఆశ్రయించిన 14 ప్రతిపక్షాలు

- 5న విచారణకు సుప్రీం అంగీకారం

లోపలి పేజీలో..

అదృశ్యమైన పశుసంవర్ధక శాఖ డిడి

అచ్చన్న మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-రామాపురం (అన్నమయ్య జిల్లా)

అదృశ్యమైన కడప జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శవమై తేలాడు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని అన్నమయ్య జిల్లా రామాపురం మండలం గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గల కోనేటి బండల వద్ద మృతదేహం లభించింది. పశు సంవర్ధక శాఖ డిడి చిన్న అచ్చన్న(58)గా పోలీసులు గుర్తించారు.

వారి వివరాల మేరకు.. కడప పశు సంవర్ధశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్న అచ్చన్న ఈ నెల 14న కనిపించకపోవడంతో అతని కుటుంబ సభ్యులు, కుమారుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్‌లో దుర్వాసన వస్తుండటంతో గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారి వచ్చి శవాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు, డిపార్ట్‌మెంట్ కార్డు, హెల్త్ కార్డు ద్వారా పశు సంవర్ధక శాఖ డిడిగా గుర్తించారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా చంపేశారా? ప్రమాదవశాత్తు మరణించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గణనీయంగా పెరిగిన పన్నుల రాబడి

- 2019లో రూ.57,601 కోట్లు
- 2022లో రూ.70,979 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సొంత పన్నుల రాబడి గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదికలో ఈ విషయాన్ని పొందుపరిచారు. వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజల నుండి, ఇతర వర్గాల నుంచి వసూలు చేసే ఆదాయం 2022 నాటికి రూ.70,979 కోట్లకు చేరింది. వాస్తవంగా 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.57,409 కోట్లుగా ఉంది. ఏడాదిలోనే రూ.13,570 కోట్లు పెరిగింది. ఇది ఏ రూపంలో చూసినా ప్రజల నుంచి వసూలు చేసేదే కావడంతో వారిపైనే భారం పడుతుంది. ఈ పన్ను రాబడి 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.49,486 కోట్లు ఉండగా, 2018-19లో రూ.58,031 కోట్లకు, 2019-20లో రూ.57,601 కోట్లకు, 2020-21లో రూ.57,409 కోట్లకు చేరింది. ఒకవైపు ప్రజల ఆర్థిక భారాలు పెరుగుతుంటే ప్రభుత్వం పన్నుల్లో రాయితీ ఇవ్వాల్సింది పోయి పన్నుల భారాన్ని పెంచుకుంటూ వెళుతోంది. సొంత పన్నుల్లో ఎస్‌జిఎస్‌టి, అమ్మకాలపై పన్ను, మద్యం, వాహనాలపై పన్ను, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్లు, భూమి శిస్తు, వస్తువులు, ప్రయాణికులపై పన్ను తదితరాలు ఉంటాయి.

భవన నిర్మాణ సంక్షేమ పథకాలు కొనసాగించాలి

- కార్మికశాఖ మంత్రిని కలిసిన సిఐటియు రాష్ట్ర ప్రతినిధి బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు ప్రతినిధి బృందం కోరింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, కె సుబ్బరావమ్మ, జి ఓబులు, కార్యదర్శులు ఆర్‌వి నరసింహారావు, నూర్‌మహ్మద్ శుక్రవారం కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను మంత్రికి వివరించారు. భవన నిర్మాణ కార్మికుల బకాయి క్లెయిమ్‌లు చెల్లించాలని, కార్మికులకు మెరుగైన వైద్యం కోసం ప్రతి జిల్లా కేంద్రంలో 30 పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో మొత్తం 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సెస్ రూపంలో యజమానుల నుంచి నిధిని వసూలు చేసే అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత నిలువ ఉన్న నిధి నుంచి ఎపి వాటాగా రూ.1,100 కోట్లు వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం ఈ నిధుల నుంచి రూ.430 కోట్లు, వైసిపి ప్రభుత్వం రూ.730 కోట్లు దారి మళ్లించాయని తెలిపారు. దీంతో ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు న్యాయం జరగడం లేదని వివరించారు. బోర్డులో కొత్త సభ్యులను చేర్చుకోవడం, ఉన్నవారిని రెన్యూవల్ చేయడం దాదాపు నిలిచిపోయిందని చెప్పారు. ప్రభుత్వం వాడుకున్న నిధులన్నిటినీ బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుకు తిరిగి జమచేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాల్సిందిగా కోరారు. విశాఖపట్నం షీలానగరంలో 2016లో శిలాఫలకం వేసిన 500 పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించడం ద్వారా ఐదు లక్షల మంది కార్మికులకు వైద్య సదుపాయాలు అందించవచ్చని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-బిట్రగుంట (నెల్లూరు)

అకాల వర్షానికి పంట మొత్తం తుడిచిపెట్టుకుపోవడం, అప్పుల భారంతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన నెల్లూరు జిల్లా బోగోలు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుని భార్య వివరాల మేరకు..పాత బిట్రగుంట మాదిగపల్లికి చెందిన రమణయ్య (48) 11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశారు. సాగు కోసం రూ.6.50 లక్షలు అప్పు చేశారు. మూడు ఎకరాల్లో వరి కోసి కుప్పలు నూర్చారు. ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తాయి. మిగిలిన తొమ్మిది ఎకరాలు వర్షానికి దెబ్బతిన్నది. అకాల వర్షానికి పంట మొత్తం దెబ్బతిన్నడం, అప్పుల భారం అధికమవ్వడంతో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గొంతు నొక్కే యత్నం చేస్తోందని విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తదితరులు ఖండించారు.

నిరంకుశ దాడులను ఖండించాలి : ఏచూరి

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్రంగా ఖండించారు. "ఇప్పుడు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని వారిపై అనర్హత వేటు వేయడానికి నేరపూరిత పరువు నష్టం దావాను ఒక మార్గంగా దుర్వియోగం చేయటం ఖండించదగినది. ప్రతిపక్షాలపై ఇప్పటికే సిబిఐ, ఇడి దుర్వినియోగం చేస్తున్నారు. ఈ నిరంకుశ దాడులను ప్రతిఘటించి ఓడించాలి' అని ట్వీట్ చేశారు.

అందరం కలిసి నిలబడాలి : శరద్ పవర్

రాహుల్‌పై అనర్హత వేటు రాజ్యాంగ విరుద్ధమని ఎన్‌సిపి నేత శరద్‌పవర్ ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలు మంటగలుస్తున్నాయని, ప్రజాస్వామిక సంస్థలను దుర్వినియోగం కాకుండా కాపాడుకోవడా నికి అందరం కలిసి నిలబడాలని తెలిపారు.

ప్రహసనంగా మార్చేశారు

- పెట్టుబడి వ్యయంగా రెవెన్యూ ఖర్చు చూపారు
- ఖర్చు చేయని మొత్తం రూ.26,380 కోట్లు
- కాగ్ నివేదిక వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ రానురానూ ప్రహసనంగా మారుతోందని కాగ్ (కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్) ఘాటుగా విమర్శించింది. బడ్జెట్ సమావేశాలు చివరిరోజు ఈ నివేదికను ప్రభుత్వం ఉభయ సభల ముందుంచింది. ఇందులో రాష్ట్ర రుణాలు, ఆర్థికం, ఆదాయ, వ్యయాలు, కేంద్ర నిధుల వ్యయం, జిఎస్‌టి వంటి అనేక అంశాలపై కాగ్ విశ్లేషించింది. రెవెన్యూ వ్యయాన్ని పెట్టుబడి వ్యయంగా చూపించిన విధానంపై తీవ్రంగా ఆక్షేపించింది.

కొన్ని కీలక శాఖలకు బదిలీ చేసిన ఆస్తులను మొత్తం ప్రభుత్వ ఆస్తుల నుంచి తగ్గించి చూపించకపోవడం వల్ల ఆస్తులు ఎక్కువగా ఉన్నట్లు కనిపించిందని కాగ్ ఆక్షేపించింది. ప్రధానంగా రోడ్లు భవనాల శాఖ, నీటిపారుదల శాఖల్లో ఈ పరిస్థితి గుర్తించినట్లు వివరించింది. మూలధన వాటా విషయంలో కూడా రాష్ట్రంలో చాలా తక్కువ శాతం నమోదైనట్లు పేర్కొంది. అన్ని రాష్ట్రాల సగటు 14.41 శాతంగా ఉండగా, రాష్ట్రంలో 9.21 శాతం మాత్రమే గుర్తించినట్లు వివరించింది.

కరువు ఖర్చుకు దూరంగా

రాష్ట్ర విపత్తు నిధులను ఖర్చు చేసిన తీరును కాగ్ ఆక్షేపించింది. ఈ నిధులను పబ్లిక్ డిపాజిట్ ఖాతాలకు మళ్లించి, అక్కడి నుంచి ఇతర అవసరాలకు మళ్లించడం ద్వారా కరువు సహాయక చర్యలకు నిధుల లేమి వచ్చిందని, రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొంది. అలాగే పాత లెక్కలను ఇంకా క్రమబద్ధీకరించుకోకపోవడాన్ని కూడా కాగ్ ఎత్తి చూపింది. 2004-05 నుంచి దాదాపు 18 ఏళ్లకు సంబంధించిన రూ.3,51,003 కోట్ల లెక్కలను ఇంకా క్రమబద్ధీకరించలేదని కాగ్ నివేదికలో గుర్తు చేసింది.

వనరుల ఆధారంగా ఖర్చు

తన వనరులను గుర్తించి అందుకు అనుగుణంగానే ఖర్చులు చేయాలని, ఎప్పుడైనా అదనపు నిధులు అవసరమైతే శాసనసభ నుంచి అనుమతి తీసుకోవాలని కాగ్ చెప్పింది.

పిడి ఖాతాల్లో అస్పష్టత

వివిధ శాఖల్లో అనుసరిస్తున్న పబ్లిక్ డిపాజిట్ ఖాతాల నిర్వహణ సరిగ్గా లేదని చెప్పింది. సంచిత నిధి నుంచి పిడి ఖాతాలకు మళ్లించిన నిధులను ఖర్చు చేయడంలో అజమాయిషీ లోపించినట్లు పేర్కొంది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, అథారిటీలు కూడా సరైన పద్దులు చూపించడం లేదని, ఇది ఆయా యంత్రాంగాల్లో అంతర్గత నియంత్రణ లేకపోవడం దీనికి ఒక కారణమని పేర్కొంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.11,238 కోట్ల పిడి ఖాతాల ద్వారా సర్దుబాట్లు జరిగాయని, ఈ సర్దుబాట్లు కూడా ఖజానా ద్వారా కాకుండా కేంద్రీకృత ప్రాసెసింగ్ సెల్ ద్వారా చేశారు. అలాగే అనేక లావాదేవీల్లో అవసరమైన పత్రాలు కనిపించలేదని పేర్కొంది.

నష్టాల్లో పిఎస్‌యులు

రాష్ట్రంలో ఉన్న పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో 17 పిఎస్‌యులు నష్టాల్లో ఉన్నట్లు కాగ్ గుర్తించింది. ఈ నష్టం విలువ రూ.26,531 కోట్లుగా గుర్తించింది. అలాగే ఈ యూనిట్ల నికర విలువ రూ.18,084 కోట్లు పూర్తిగా హరించుకుపోయాయని వివరించింది. ప్రధానంగా మూడు డిస్కామ్‌లలో వాటాదారుల విలువ హరించుకుపోయినట్లు గుర్తించింది. బడ్జెట్‌లో లేని రుణాలతో సహా గణిస్తే జిఎస్‌డిపిలో 40.85 శాతం రుణాలుగా ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో బడ్జెటేతర రుణాలు రూ.1,18,394 కోట్లు ఉన్నాయి.

హమాలీలకు కూలి రేట్లు, బకాయిలు : యూనియన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చౌక డిపోల వద్ద ప్రజా పంపిణీ సరుకుల దిగుమతికి సంబంధించిన హమాలీస్ కూలిరేట్లు, బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్‌డి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రజా పంపిణీ సరుకుల దిగుమతికి సంబంధించి 21.02.2023 వరకు హమాలీలకు డీలర్లు ఛార్జెస్ చెల్లిస్తుండగా, వీటిని 22.02.23 నుంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని 24.02.23న ఎమ్‌డి పేర్కొన్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. జిల్లాల్లో డిఎంలు కూడా ఇదే విషయాన్ని చెప్పారని, ఇప్పటికీ దిగుమతి కూలి చెల్లించలేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ గౌరవా ధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదయభాస్కరరావు, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు న్యాయం చేయండి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు న్యాయం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద ఆరోగ్యమిత్రల సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్రంలో ఆరోగ్యమిత్రలు 16 ఏళ్లుగా తక్కువ వేతనంకే పనిచేస్తున్నారని తెలిపారు. వారికి కేవలం రూ.13 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఆరోగ్యమిత్రలకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 25 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ కూడా ఇచ్చారని తెలిపారు. సమానపనికి సమాన వేతనం అనే నిబంధన విద్యుత్ సంస్థల్లో అమలు కావడం లేదన్నారు. తెలంగాణలో వేతనాలు ఎక్కువగా వున్నాయని, ఆ తరహాలో పెంచాలని కోరారు. విద్యుత్ సంస్థలను విలీనం చేయాలని కోరారు.

బిసి గురుకులాల్లోని గెస్ట్ ఫ్యాకల్టీల వేతనాలు పెంచాలి : ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బిసి గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్‌ఫ్యాకల్టీ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు వేతనాలు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. శాసనమండలిలో బిసి సంక్షేమంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది గెస్ట్‌ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని కోరారు.

తెలుగు 'వర్సిటీ'ని రాష్ట్రానికి తరలించరా?

- విభజన తరువాత నిర్లక్ష్యం
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైదరాబాద్‌లో ఉన్న తెలుగు యూనివర్సిటీని రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత రెండు ప్రభుత్వాలు ఏర్పడ్డాయని, అయినా రాష్ట్రానికి తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో ఉత్తరాంధ్రలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఎప్పటికి పూర్తిచేస్తారో చెప్పాలని టిడిపి సభ్యులు అడిగిన ప్రశ్నపై స్వల్ప చర్చ జరిగింది. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. గతంలో యూనివర్సిటీని రాష్ట్రానికి తరలించేందుకు ఒక కమిటీ వేశారని, ఇప్పుడు దాని గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. తెలుగు యూనివర్సిటీకి రాజమండ్రిలో స్థలం కేటాయించారని, నిర్మాణం మరిచారని అన్నారు. తాళపత్ర గ్రంథాలను రాష్ట్రానికి తీసుకొచ్చే ప్రయత్నమూ జరగడం లేదన్నారు. యూనివర్సిటీ అంశంపై తెలంగాణ ప్రభుత్వంతో వివాదం నడుస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పారు. గిరిజన యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూ.61 కోట్లు కేటాయించిందని పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి తెలిపారు. రాష్ట్రంలో బిసి స్టడీ సర్కిళ్లను బలోపేతం చేయాలని లక్ష్మణరావు కోరారు. డైరెక్టర్లు లేక పనిచేయడం లేదని, పుస్తకాలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. బిసి గురుకులాల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పిడిఎఫ్‌కు చెందిన మరో ఎమ్మెల్సీ సాబ్జీ కోరారు. ఇ-స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నామని బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సమాధానం చెప్పారు. సుబాబుల్ పంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.4,200 ప్రకటించినప్పటికీ అది అమలు కావడం లేదని కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆయనకు వైసిపి సభ్యుడు అరుణ్‌కుమార్ మద్దతు పలికారు. కేవలం రూ.2 వేల నుంచి రూ.2500 వరకే అందుతోందని, రైతులకు కనీస మద్దతు ధర కల్పించి న్యాయం చేయాలని కోరారు. గుంటూరు చానల్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఏళ్ల తరబడి రైతులు దీనికోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పత్తిపాడు, బాపట్ల జిల్లాలోని ప్రజలు సాగు, తాగునీటి అవసరాల కోసం పోరాడుతున్నారని చెప్పారు. ఈ చానల్ పనులు జరగడం లేదని, అప్పుడప్పుడు ఫొటోల కోసం అధికారులు పనులు ప్రారంభిస్తున్నారని వైసిపి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. ఈ చానల్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.113.39 కోట్లు కేటాయించిందని, 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రతిపాదించామని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సమాధానం చెప్పారు. ప్రైవేటు కళాశాలల్లో పిజి చదివే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం అందించడం లేదని లక్ష్మణరావు, షేక్ సాబ్జీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు.



ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

5న చలో ఢిల్లీ

- పోస్టరు ఆవిష్కరించిన ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో 'చలో ఢిల్లీ' పోస్టరును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ విధానాలు కార్మికులకు, కర్షకులకు తీవ్రమైన హానీ చేశాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పెద్దఎత్తున కేంద్రం కార్పొరేట్లకు అప్పగిస్తోందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరించేందుకు సైతం పూనుకుందన్నారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమంతో నూతన వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటంచిన మోడీ ప్రభుత్వం వాటిని దొడ్డిదారిన అమలు చేయడానికి పూనుకుంటోందన్నారు. ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించిన కేంద్రం మాటతప్పిందన్నారు. ఈ నేపథ్యంలోనే మోడీ హటావో, మోడీ విధానాలు మార్చుకో అనే నినాదాలతో దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించేందుకు తరలి వస్తున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 12 డిమాండ్ల సాధనకు చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులకు భారీగా కోతపెట్టిందని, ఈ చట్టానికి రూ.2 లక్షల కోట్లు కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి వై కేశవరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఉత్పత్తి రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు చూస్తోందన్నారు.

దీన్ని తిప్పికొట్టేందుకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు అందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ తదితరులు పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు విధానపరమైన నిర్ణయం

- శాసన సభలో ఎమ్మెల్యే పార్థసారధి సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభ బడ్జెట్ సమావేశాలు జీరో అవర్‌లో పలు అంశాలను ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దాదాపు రెండు గంటలపాటు జీరో అవర్‌లో మాట్లాడేందుకు అవకాశం వచ్చింది. 40 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. పెనమలూరు ఎమ్మెల్యే కె పార్థసారధి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. రాత్రి వేళ పెద్దవారు సైతం భయపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కుక్కల బెడద నివారణకు ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ.. హంద్రీనివా కాలువల ద్వారా నీరు సరిగ్గా రావడం లేదన్నారు. కర్నూలు జిల్లాలో కల్తీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని పాణ్యం కాటసాని రామ్‌భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు గతేడాది పరిహారం ఇవ్వలేదన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పలు కులాలు ఎస్‌సి లేదా ఎస్‌టిలుగా పరిగణించాలని కోరుతున్నాయన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. బిసిలలో చేర్పించే అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందన్నారు. ఎస్‌సి లేదా, ఎస్‌టిల్లో చేర్పించాలంటే కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తాను భూ కుంభకోణాలకు పాల్పడినట్లు నారా లోకేష్ ఆరోపించడాన్ని ఖండించారు. ఈ వ్యవహారంపై సిఐడి లేదా విజిలెన్సు దర్యాప్తు చేయించాలని లేదా ఆరోపణలు నిరూపణ కాకుంటే లోకేష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో చంద్రబాబు కూడా ఇలాగే ఆరోపణలు చేశారని తెలిపారు. నందికొట్కూరు ఎమ్మెల్యే టి ఆర్థర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలకు నష్టపోయినే రైతులను ఆదుకోవాలన్నారు. ఇదే అంశాన్ని కందుకూరు ఎమ్మెల్యే మహిధర్ రెడ్డి కూడా ప్రస్తావించారు. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లు నిర్మించాలన్నారు. టిడ్కో ఇళ్లు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలో విద్యార్థులకు ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉండటం లేదన్నారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలో ఉప్పునీటి కయ్యలు పెరగడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయన్నారు. భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మధురవాడలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. టిడిపి హయాంలో పరిశ్రమల పేరుతో కేటాయించిన భూ కేటాయింపులపై విచారణ చేయించాలన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. బాపట్ల ఆస్పత్రిని రిఫరల్ ఆస్పత్రిగా మార్చాలన్నారు. వీరితోపాటు పలువురు ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను జీరో అవర్‌లో ప్రస్తావించారు.

అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే కలుగజేసుకుని పక్షపాత వైఖరి లేకుండా నిందితులకు శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం నిలబడుతున్నానని చెప్పుకుంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ దళితులను పరామర్శించి భరోసా ఇవ్వాలని కోరారు. తొలుత శృంగవృక్షం గ్రామంలో గాయపడిన పులుగు భాను, కోవూరి అనిల్ కుమార్, రవి, నక్క నాగేశ్వరరావు, నక్క ఇస్సాక్‌లను శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా నేపా నూకరాజు, నేపా కృష్ణ, నేతల నాగమణి తదితరులు ఆయనతో మాట్లాడారు. దాడిలో ప్రధాన నిందితుడైన గంగాధర్‌ను తప్పించడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారని వారు తెలిపారు. ఇళ్లల్లోకి చొరబడి దౌర్జన్యం చేసినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా నిందితులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు వెంట సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.సింహాచలం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము, సిఐటియు నాయకులు నెక్కా శ్రీను, సోమాల ప్రసాద్ ఉన్నారు.



చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరుతున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

టిడిపిలో చేరిన గిరిధర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపిలో చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో శుక్రవారం టిడిపి కండువా కప్పుకున్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఆయనతోపాటు మరికొంత మంది వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. గిరిధర్‌రెడ్డి వంటి వారు పార్టీలోకి రావడం వల్ల పార్టీ బలం ఇంకా పెరుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఫలితాలు చూశాక జగన్‌కు నిద్రపట్టడం లేదని విమర్శించారు. అంతకు ముందు నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెను నుంచి సుమారు 300 కార్లతో విజయవాడ వరకూ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని గిరిధర్‌రెడ్డి చెప్పారు. అందుకే తాను టిడిపిలో చేరుతున్నానని, ఒక కార్యకర్తగా ఉంటానని తెలిపారు.

చంద్రబాబును కలిసిన అనూరాధ

చంద్రబాబును టిడిపి ఎమ్మెల్సీగా గెలుపొందిన పంచుమర్తి అనూరాధ కలిశారు. మంగళగిరికి చెందిన పద్మశాలి నేతలతో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిశారు. అంతకుముందు టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు కూడా చంద్రబాబును కలిశారు.

'బాదుడే-బాదుడు' సమస్యలతోనే మ్యానిఫెస్టో, హామీల అమలుకు ప్రత్యేక మంత్రి

టిడిపి నిర్వహిస్తున్న బాదుడే-బాదుడు కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యల ఆధారంగానే ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందిస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమిస్తామన్నారు. టిడిపి జోన్-3 సమావేశం మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు పెట్టాలని జగన్ భావిస్తున్నారని, అన్ని స్థానాల్లో టిడిపి స్వీప్ చేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపుతో వైసిపిలో లుకలుకలు మొదలయ్యాయని చెప్పారు. మొన్నటి వరకు 175కు 175 అన్నారని, ఇప్పుడు జగన్‌కు మిగిలింది గుండు సున్నానే అని వ్యాఖ్యానించారు. పోలవరం పనులు టిడిపి ప్రభుత్వం 72 శాతం పూర్తిచేసిందన్నారు. 45.67 మీటర్ల ఎత్తులో కట్టాల్సి ఉంటే 41.15 మీటర్లకు కుదించడంతో ప్రాజెక్టు కాకుండా బ్యారేజ్ అవుతుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందని జగన్ కబుర్లు చెబుతున్నారని అన్నారు.

చంద్రబాబుకు ఐటి నోటీసులు : సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు నోటీసులు ఇచ్చారని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదాయపన్నుశాఖ దేశంలో జరిపిన దాడుల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజాధనం ఏ విధంగా లూటీ అయ్యిందనే విషయంపై శాసనసభ నియమావళి 338 కింద ప్రకటన చేసిన పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చర్చను ప్రారంభించారు. చర్చలో సిఎం జోక్యం చేసుకుంటూ.. అమరావతిలో జరిగిన నిర్మాణాల్లో అవినీతి జరిగిందని, ఇక్కడ తీసుకునే కమిషన్లే కాకుండా దుబాయ్‌లో కూడా రూ.15 కోట్లు దినార్లలో ఇచ్చినట్లు మనోజ్ వాసుదేవ్ ఆధారాలతో సహా రాసి సంతకం పెట్టి ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌కు ఇచ్చిన నేపథ్యంలో నోటీసులిచ్చారన్నారు. షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్‌పై ఐటి దాడులు జరగడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చిందన్నారు. 2019 నవంబరులో దాడులు జరిగిన నేపథ్యంలో సమాచారమంతా ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌కు దొరికిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంటు కుంభకోణంలో రూ.371 కోట్లు కేవలం మూడు నెలల కాలంలో ఐదు దఫాలుగా రాబట్టారని, అందులో కూడా యోగేష్ గుప్తా పాత్రదారి అని సిఎం వెల్లడించారు.

త్వరితగతిన టీచర్ పోస్టులు భర్తీ

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టూ వేయలేదని, త్వరితగతిన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. డిఎస్‌సి వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రోజుకో రకంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలపై విద్యాశాఖ సరైన సమాచారం చెప్పలేకపోతోందన్నారు. 717 ఖాళీలు ఉన్నాయని శాసన మండలిలో చెప్పి, పదివేలు పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 50 వేలకుపైగా ఖాళీలున్నాయని, వాటిని త్వరితగతిన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వేట సమయంలో మరణించిన ప్రతి మత్స్యకారునికీ ఎక్స్‌గ్రేషియా

- దత్తత దేవాలయ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించాలి
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేట సమయంలో మృతిచెందిన ప్రతి మత్స్యకారునికీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రస్తుతం కుటుంబ యజమాని చనిపోతేనే రూ.10 లక్షలు ఇస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభలో శుక్రవారం 'మత్స్యకారులకు ఆర్థికసాయం' అంశంపై ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. బోట్లకు ఇన్సూరెన్స్ ఉండదని, దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటికి ఇన్సూరెన్సు ఉండదని, ప్రభుత్వమే బోట్లకు కార్పస్ ఫండ్ సమకూర్చాలన్నారు. చేపల వేటకు విరామం రాష్ట్రంలో ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు ఉందని, వెస్ట్ కోస్ట్ పరిధిలో ముఖ్యంగా కేరళలో జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు విరామం ఉందని, ఈ అంశంపై ఓ అధ్యయన కమిటీ వేయాలని గ్రంధి శ్రీనివాస్ కోరారు. సభ్యులు మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 8,600 ఆలయాలు ఉన్నాయని, అనేక ఆలయాల్లో అర్చకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అర్చకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కోవిడ్ సమయంలో 17,500 మంది అర్చకులకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం సహాయం చేసిందని, వంశపారంపర్య అర్చకుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గ పరిధిలోని వాల్మీకిపురంలోని పట్టాభిరామస్వామి ఆలయాన్ని టిటిడి దత్తత తీసుకుందన్నారు. ఆలయంలో పనిచేసే ఉద్యోగులకు టిటిడి ఉద్యోగుల తరహా సర్వీసు రూల్స్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

టిడిపి సభ్యుల సస్పెన్షన్

శాసనసభ శుక్రవారం ప్రారంభం కాగానే టిడిపి సభ్యులు జిఓ నెంబరు 1ని రద్దు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలంటూ స్పీకరు పోడియం వద్దకు వెళ్లారు. 11 మంది టిడిపి సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకరు ప్రకటించారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే సహించం

- నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు : గిరిజన సంఘం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే సహించేది లేదన్నారు. అసెంబ్లీ తీర్మానాన్ని ఖండిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని గిరిజనులకు ఆయన పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం బోయ/వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమన్నారు. ఆయన గిరిజన ద్రోహిగా మిగిలిపోతారని పేర్కొన్నారు. రాయలసీమలోని 40 లక్షల జనాభా కలిగిన బోయ/వాల్మీకిలు నాన్ షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తూ బిసి-ఎ జాబితాలో ఉన్నారన్నారు. వారికి ఎటువంటి ప్రత్యేక భాష, ఆచారాలు, సంప్రదాయాలూ లేవని తెలిపారు. డాక్టర్ బిఎన్ లోకూరు కమిషన్ నివేదిక ప్రకారం బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు అర్హత లేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, గతంలో టిడిపి ప్రభుత్వం కూడా వారిని గిరిజన జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తు చేశారు. అసలైన గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనాలు అందించటమే లక్ష్యం


- వ్యవసాయ మంత్రి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

కల్తీలేని నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కృష్ణాజిల్లా మండల కేంద్రమైన గన్నవరం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయ ఆవరణలో రూ.46 కోట్లతో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వైఎస్‌ఆర్ విత్తన పరిశోధన, శిక్షణ కేంద్రానికి కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆర్‌కె రోజా, గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ తదితరులతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో వారణాసిలో మాత్రమే జాతీయ విత్తన పరిశోధన కేంద్రం ఉందని, మొట్టమొదటి సారి మన రాష్ట్రంలో విత్తన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయపరమైన సూచనలు, సలహాలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 10,778 ఆర్‌బికెలు, అన్ని నియోజకవర్గాల్లో అగ్రిల్యాబ్స్ ఏర్పాటు చేశామని అన్నారు. విత్తనం మంచిదైతే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. అందువల్ల ప్రధానంగా విత్తనంపై దృష్టి పెట్టామన్నారు. ఆర్‌బికెలలో ఉన్న వ్యవసాయ, మత్స్య సహాయకులకు విత్తన పరిశోధనపై తగిన శిక్షణ ఇస్తామన్నారు. ఏడాదిలోగా ఈ కేంద్రాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, ఎండి శేఖర్ బాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను పరిరక్షించండి

- రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి
- రాష్ట్ర ఎంపిలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బహిరంగ లేఖ



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎంపీలకు రాసిన బహిరంగ లేఖను చూపుతున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం, జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కును పరిరక్షించి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర ఎంపిలకు తమ పార్టీ తరుపున బహిరంగ లేఖ రాశామని తెలిపారు. విశాఖపట్నం జిల్లా జగదాంబలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంటు సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరోధించి, ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేయడానికి ఎలాంటి చర్చా జరగలేదన్నారు. జనవరి 30న స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో జరిగిన బహిరంగ సభలో కర్మాగారాన్ని పరిరక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని అధికార పార్టీ నాయకులు కార్మికులకు హామీ ఇచ్చారని, కానీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎంపిలు చొరవ తీసుకుని ఇతర పార్టీల నేతలను కూడగట్టి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన హామీని పొందేందుకు ప్రయత్నించాలన్నారు. కార్మికులు, ఉద్యోగులు, యాజమాన్యం సమిష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ ఇప్పటికీ సమర్ధవంతంగా నడుస్తోందని తెలిపారు. దీన్ని కాపాడుకోకుండా గ్లోబల్ ఇన్వెస్టర్లతో ఎలాంటి ఫలితం ఉండదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించినా, మూసివేసినా వేలాది మంది కార్మికులు వీధినపడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను నష్టాలపాలు చేసి మూసివేయాలన్న దుష్ట సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అందులో భాగంగానే ఉత్పత్తిని తగ్గించే చర్యలకు పూనుకుంటున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం స్టీల్ ప్లాంట్‌కు ముడిఇనుము, బొగ్గును సకాలంలో తెప్పించకుండా జాప్యం చేస్తోందని తెలిపారు. ప్లాంట్‌ను కేవలం 60 శాతం సామర్థ్యంతోనే నడుపుతున్నారన్నారు. సొంత గనులను దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్లకు ఇచ్చి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వకపోవడం సరికాదని తెలిపారు. ఇదే ఈ పరిశ్రమకు కీలకమైన సమస్యని పేర్కొన్నారు. ప్లాంట్‌లో ఉద్యోగ విరమణ చేస్తున్న వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తిప్పికొట్టాలని, సొంత గనుల కేటాయింపు, ప్లాంట్ విస్తరణ కోసం కృషి చేయాలని కోరారు.

ప్రత్యేక హోదాపై అన్యాయం జరుగుతున్నా ప్రతిఘటించరేం..

రాష్ట్ర ఎంపిలు అడిగిన ప్రశ్నకు రాతపూర్వకమైన జవాబులు ఇచ్చిన కేంద్ర మంత్రులు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని చెప్పినప్పటికీ మన ఎంపిల నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేదని శ్రీనివాసరావు తెలిపారు. కళ్లెదుటే రాష్ట్రానికి ద్రోహం జరుగుతున్నా కళ్లప్పగించి చూడడం అన్యాయమన్నారు. ఎంపిల నుంచి స్పందన లేకుంటే కేంద్ర ప్రభుత్వం తన మార్గంలో తాను వెళ్లిపోతుందని, ఇది రాష్ట్రానికి తీవ్ర నష్టమని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలుపై పార్లమెంటు సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పార్లమెంటు వేదికగా పోరాడాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి తెలంగాణ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో :ఎన్‌టిపిసి రామగుండంలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్లాంట్‌లో మొదటి యూనిట్ (800 మెగావాట్లు)అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం తెల్లవారుజామున ఈ యునిట్‌లో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. తొలిరోజు వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. బాయిలర్, టర్బైన్, బొగ్గు, యాష్, నీరు నియంత్రణ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేస్తున్నట్లు ఎన్‌టిపిసి ఇడి సునీల్ కుమార్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణ చట్టం 2014 ప్రకారం మొత్తం నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్లాంట్‌ను కేంద్రం తెలంగాణకు కేటాయించింది. ఆ మేరకు 2017లో నిర్మాణ పనులు మొదలై ఇటీవల పూర్తయ్యాయి.

కులదురహంకారులను శిక్షించాలి

- మృతుడు రాము కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవరం గ్రామంలో జాతర నేపథ్యంలో దళితపేటపై మూకుమ్మడి దాడి చేసిన కులదురహంకారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. శృంగవరంలో జాతర నేపథ్యంలో కులదురహంకారులు మూకుమ్మడిగా బీరుబాటిళ్లు, రాళ్లతో దాడి చేశారని తెలిపారు. ఈ దారుణ దాడిలో నడిపల్లి రాము మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని వివరించారు. రాము హత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, రాము కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాము కుటుంబానికి ఐదెకరాల భూమితోపాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని కోరారు. ఈ ఘటనలో గాయపడ్డ బాధితులకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపు నింగిలోకి 'ఎల్‌విఎం3-ఎం3'

- నేటి నుంచి కౌంట్‌డౌన్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ షార్ మరో వాణిజ్యపరమైన రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు 'ఎల్‌విఎం3-ఎం3' రాకెట్‌ను ప్రయోగించనుంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుండి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ద్వారా యుకెకు చెందిన 36 ఉపగ్రహాలను నింగిలోకి పంపనున్నారు. వన్ వెబ్ ఇండియా-2 మిషన్ ద్వారా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారం ఇప్పటికే ఒకసారి ఇస్రో 36 యుకె ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలో నిలిపింది. ఇప్పుడు రెండవసారి మరో 36 ఉపగ్రహాలను భూమికి సమీపంలోని 450 కిలోమీటర్ల దూరంలో గల లియో ఆర్బిటల్ వృత్తాకారపు కక్ష్యలో ప్రవేశపెట్టబోతుంది. మొత్తం ఈ ఉపగ్రహాల బరువు 5805 కిలోల వరకు ఉంటుంది. ప్రయోగం అనంతరం ఈ రాకెట్ 20 నిమిషాలపాటు అంతరిక్షం వైపు ప్రయాణించిన అనంతరం 36 ఉపగ్రహాలను ఒకదాని తర్వాత ఒకదానిని కక్ష్యలోకి వదలడం జరుగుతుంది. ఎల్‌విఎం3- ఎం3 రాకెట్ ఎత్తు 43.5 మీటర్లు. బరువు 643 టన్నుల వరకు ఉంటుంది. గతేడాది అక్టోబర్ 23న ఇదే తరహాలో రాకెట్ ప్రయోగం ద్వారా 36 ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఇస్రో అదే తరహా ఉత్సాహంతో ఇప్పుడు ఈ ప్రయోగం విజయానికి సన్నహాలు సిద్ధం చేస్తోంది. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన 24 గంటల కౌంట్‌డౌన్‌ను శనివారం ఉదయం 9 గంటలకు ఇస్రో ప్రారంభిస్తుంది.

జివిఆర్ హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా వైద్యుడు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్, నెల్లూరు హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ జి. విజయకుమార్ హత్య కేసుకు సంబంధించి నెల్లూరు మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి మృతుడు డాక్టర్ జి.విజయకుమార్ భార్య వి.ఉషారాణి, న్యాయవాది కునిశెట్టిశ్రీధర్, మృతుని కుమారుడు జి.సుందరయ్య, ఎం.గంగరాజు, పి.రాజులపై హత్యానేరారోపణలు రుజువు కావడంతో వీరందరికీ యావజ్జీవ శిక్షతోపాటు రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించింది. నెల్లూరు నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో 'నెల్లూరు హాస్పిటల్'ను డాక్టర్ జి. విజయకుమార్ స్థాపించి వైద్యసేవలందిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో కుటుంబంలో వివాదాలు ఏర్పడడంతో భార్యతో విడిపోయి పోస్టల్ కాలనీలోని తన తల్లి వద్దే ఉండేవారు. ఆస్తిని చేజిక్కించుకోవాలన్న దురాలోచనతో తన భర్తను హతమార్చేందుకు భార్య ఉషారాణి వ్యూహరచన చేశారు. న్యాయవాది శ్రీధర్, కుమారుడు జి.సుందరయ్య, మరో ఇద్దరు కిరాయి హంతకులు గంగరాజు, రాజు సహాయం తీసుకున్నారు. 2015 మే 28న అర్ధరాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో డాక్టర్ విజయకుమార్ గొంతు నులిమి హత్య చేశారు. గుండెపోటుతో విజయకుమార్ మృతి చెందారంటూ హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించేం దుకు సిద్ధమయ్యారు. విజయకుమార్ భౌతికకాయాన్ని సందర్శించిన తోటి మిత్రులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరి ఆడకుండా చేసి విజయకుమార్‌ను హత్య చేసినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సి.సత్యవాణి శుక్రవారం తీర్పునిచ్చారు. దీంతో పాటు ఒకొక్కరికి రూ.ఐదు వేలు జరిమానా విధించారు.

భారంగా అప్పులు

- కొట్టి పారేయలేమన్న కాగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రం 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి 2021-22 వరకూ అప్పు తెచ్చిన మొత్తాల్లో 65 శాతం నుంచి 83 శాతం వరకూ రుణాల చెల్లింపులకే ఉపయోగించడం ప్రమాదమని కాగ్ అక్షింతలు వేసింది. ఆస్తులు సృష్టించకుండా ప్రధాన రుణ బాధ్యత నుంచి బయటపడేందుకు మరలా రుణాలపైనే అధారపడటం పెరిగిందని తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పెరిగి ప్రభుత్వ రుణం భరించలేనిదిగా మారి రాష్ట్రం అప్పుల వలయంలో చిక్కుకునే అవకాశాన్ని కొట్టి పారేయలేమని పేర్కొంది. ప్రభుత్వం తీసుకున్న రుణాలకు సంబంధించి తిరిగి చెల్లించే బాధ్యత 2024-25 నాటికి రూ.42,236 కోట్లకు అంటే పతాకస్థాయి చేరి అక్కడ నుండి క్రమంగా తగ్గుతుందని కాగ్ అంచనా వేసింది. అందులోనూ 2026-27 నుండి తగ్గుతుందని, ఇందులో 2028-29 మినహాయింపు ఉంటుందని పేర్కొంది. అయితే దీనికి సంబంధించి క్రమంగా ఆదాయాలను పెంపొందించుకోకపోవడం వల్ల ప్రతి సంవత్సరం ప్రస్తుత ఖర్చుల నిమిత్తం బహిరంగ మార్కెట్ రుణాలపై ఆధారపడటం వల్ల రుణ బాధ్యత పెరిగే ప్రమాదమూ లేకపోలేదని హెచ్చరించింది.

సంవత్సరం	రుణం (రూ.కోట్లలో)	వడ్డీ	మొత్తం
2021-22	12513	20504	33017
2022-23	13985	21219	35204
2023-24	15613	20026	35640
2024-25	23854	18393	42248
2025-26	22416	16744	39161
2026-27	20010	15085	25095

ఆరోగ్య శ్రీ వద్ద ఉద్యోగుల కంట్రిబ్యూషన్

- ఉద్యోగ సంఘాల డిమాండ్‌కు సిఎస్ అంగీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు చెల్లిస్తున్న హెల్త్ స్కీం కాంట్రిబ్యూషన్ సొమ్మును ఆరోగ్యశ్రీ ట్రస్టు వద్ద ఉంచాలనే ఉద్యోగ సంఘాల డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి అంగీకరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన హెల్త్ స్కీం, పిఆర్‌సి అంశాలపై సిఎస్ సచివాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. పిఆర్‌సికి సంబంధించిన వివిధ పెండింగ్ అంశాలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని సిఎస్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు ఈ నెల 31తో ముగియనుందని, దీనిని మరో ఏడాది పొడిగించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. ఈ అంశం ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో అవినీతి

- వెల్లడించిన కాగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రిజిస్ట్రేషన్ల శాఖలో జరుగుతున్న అవినీతి వల్ల ప్రభుత్వానికి రావాల్సినంత ఆదాయం రావడం0 లేదని కాగ్ మొట్టికాయలు వేసింది. రిజిస్ట్రేషన్ అధికారులు నిబంధనలు పాటించకపోవడం వల్ల నాలుగు కేసుల్లో రూ.7.27 కోట్లను నష్టపోవాల్సి వచ్చిందని కాగ్ పేర్కొంది. 57 దస్తావేజుల్లో లావాదేవీలు తప్పుగా వర్గీకరించడంతో రూ.2.10 కోట్లు స్టాంప్ డ్యూటీ తక్కువగా వచ్చిందని తెలిపింది. ఒకటి కంటే ఎక్కువ లావాదేవీలున్న దస్తావేజులకు సంబంధించిన 28 కేసుల్లో రూ.1.61 కోట్ల స్టాంప్ డ్యూటీ తక్కువగా విధించారని పేర్కొంది. మార్కెట్ రేటుకంటే తక్కువ రేటుతో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడం, చదరపు గజం బదులు ఎకరాల పద్ధతిలో ధరను పరిగణనలోకి తీసుకున్న 27 డాక్యుమెంట్లలో రూ.1.10 కోట్లు నష్టం జరిగినట్లు పేర్కొంది. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆస్తుల్లో ఉమ్మడి వాటాలను కలపని తొమ్మిది రిజిస్ట్రేషన్లకు సంబంధించి రూ.51.19 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపింది. విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చిన భూమికి సంబంధించి ఆరేళ్లు గడిచినా భూ బదలాయింపు ప్రక్రియ ఖరారు చేయకపోవడంతో మిగతా భూమికి సంబంధించి ధర రూ.1.19 కోట్లు వసూలు చేయలేదని తెలిపింది. భూ మార్పిడి కోసం తక్కువ రేటు తీసుకోవడం వల్ల రూ.47.81 లక్షలు నష్టం వాటిల్లిందని పేర్కొంది.

టిడిపి సంబరాల్లో అపశృతి

టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్ వద్ద బాణసంచా కాలుస్తూ నలుగురు కార్యకర్తలు గాయపడ్డారు. నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి టిడిపిలో చేరిక సందర్భంగా శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది.వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులతో చంద్రబాబు మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

సంపాదకీయం

దళితులకు రక్షణేది?

దేశాన్ని కుల, మత జాడ్యాలు ఇంకా పట్టి పీడిస్తూనే ఉన్నాయి. పెత్తందారీ కుల కాలనాగులు అవకాశమొచ్చినప్పుడల్లా అణగారిన ప్రజానీకాన్ని కాటేసి ప్రాణాలు తోడేస్తూనేవున్నాయి. కులం వద్దు..మతం వద్దు.. భారతీయులంతా స్వేచ్ఛా స్వతంత్రాలు అనుభవిద్దామంటూ చేసుకున్న ప్రతినలన్నీ వెక్కిరింతకు గురవుతూనేవున్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షంలో పెత్తందారీ గూండాల దాడిలో దళిత యువకుడు బలైపోవడం, మరో తొమ్మిది మంది దళితులు గాయపడటం సమాజంలో వేళ్లూనుకున్న పెత్తందారీ దురహంకారాన్ని మరోమారు బయటపెట్టింది. కొన్ని నెలల కిందటే అధికార పార్టీకి చెందిన ఒక ప్రజా ప్రతినిధి తన వద్దే డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత యువకుడిని హత్య చేసి..మృతదేహాన్ని సదరు ప్రజా ప్రతినిధే నేరుగా బాధితుడి ఇంటికి డోర్ డెలివరీ చేసిన దారుణ ఉదంతం నుంచి జిల్లా తేరుకోక మునుపై మరో ఘోరం చోటు చేసుకుంది.

శృంగవృక్షమనేది కాకినాడ జిల్లాలో చిన్న గ్రామం. ప్రతి యేటా ఇక్కడ జరిగే నూకాలమ్మ జాతరలో అన్ని సామాజిక తరగతులవారు పాల్గొనడం ఆనవాయితీ. అందరూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోవడం..మొక్కులు తీర్చుకోవడం గత కొన్ని తరాలుగా అనుసరిస్తూ వస్తున్న ఆనవాయితీ. జనం రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు పరస్పరం కాళ్లూచేతులు రాసుకోవడం, ఒక్కో సందర్భంలో కిందామీదా పడటం సర్వసాధారణం. శృంగవృక్షం జాతరలోనూ అదే జరిగింది. జనం రద్దీలో పెత్తందారీ కాలు.. దళిత యువకుడి కాలు పరస్పరం రాసుకున్నాయి. 'మన కులపోడి కాలు నెత్తిన తగిలినా బాధలేదయ్యా..దళితుడి కాలు సోకితే ఊరుకుంటామా?' అంటూ కుగ్రామమైన శృంగవృక్షంపై మూకుమ్మడి దాడికి తెగబడ్డారు. జాతరలో కాలు రాసుకున్న నేరానికి శృంగవృక్షం దళితపేటపై పెత్తందార్లు రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. దొరికినవారిని దొరికినట్టు చితకబాదారు. ఈ దాడిలో తొండంగి గ్రామానికి చెందిన నడింపల్లి రాము అనే దళిత యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఇంత దారుణంగా దాడికి పాల్పడినా.. పెత్తందార్ల జోలికి వెళ్లకుండా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తూ ఉండిపోయారే తప్ప ఎలాంటి తక్షణ చర్యలకు ఉపక్రమించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెల్లారితే ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవాల్సినవాళ్లం..కేసులుగీసులు ఎందుకయ్యా..సర్దుకుపోతే అందరికీ మంచిదంటూ దళితులకు మైండ్‌వాష్ చేసే పనిని ఖాకీలు భుజానికి ఎత్తుకోవడం దిగ్భ్రాంతికరం. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) వంటి ప్రజాసంఘాలు నిలదీయకపోతే అస్సలు కేసు కూడా నమోదు చేసేవారు కాదేమో!

విజయవాడలో స్వరాజ్య మైదానంలో ఆకాశాన్నంటేలా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మిస్తున్నామని, దళితులకు, అణగారిన ప్రజానీకానికి తాము పెద్ద పీట వేస్తున్నామని పాలకులు మాటలు చెబితే సరిపోదు. 'దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటామా?' అంటూ ప్రశ్నించే పెత్తందారీ ఆధిపత్య భావాజాలాన్ని పూర్తిగా విడనాడాలి. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు శిరోముండనాలు చేయించడం, అత్యాచారాలు, హత్యలు వంటివి తరచూ చోటుచేసుకోవడం దేనికి సంకేతం. దాడులు జరిగినప్పుడు ఒంటికాలిపై లేవడం.. అరకోపరకో పరిహారమిచ్చి చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? ఇలాంటి దాడులకు పాల్పడినవారి పీచమణచాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్దర వీడి దళితులు, ఆదివాసీలు, ఇతర అణగారిన ప్రజానీకం రక్షణకు గట్టి చర్యలు చేపట్టాలి. బాధిత దళితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా ఇవ్వాలి. శృంగవృక్షంలో ప్రాణాలు కోల్పోయిన రవి కుటుంబానికి ప్రజా సంఘాలు కోరుతున్నట్లుగా ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల పరిహారం, ఐదు ఎకరాల సాగుభూమి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. అంతేకాదు, దాడికి కారకులైనవారిని కఠినాతికఠినంగా శిక్షించాలి. కేంద్రంలో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయి. రాష్ట్రంలో అటువంటి పరిస్థితి రాకుండా చూడాలంటే దళితులు, గిరిజనుల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. దాడి జరిగిన తరువాత లేపనం పూయడం కాదు..ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలి. అణగారిన తరగతులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అనువైన వాతావరణం కల్పించాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేవాలి. ఇందుకు విశాల ప్రజా ఉద్యమాలే మార్గం.

మహనీయుల మాట



మతతత్వాన్ని మట్టుబెట్టే పని ముస్లింలది, సిక్కులది, క్రైస్తవులది, హిందువులది-అంతే కాదు, భారతీయులందరిదీ! దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరుచుకోవాలి!

- సుభాష్ చంద్రబోస్

దేశ రక్షణకు సంపద సృష్టికర్తల ఐక్య పోరాటాలే శరణ్యం

వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలు కాలానుగుణంగా పెరగడం లేదు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు, నయా ఉదారవాద విధానాల ప్రభావం వల్ల భూమి లేని, ఇళ్ళు లేని వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సాంఘిక సంక్షేమ రాజ్యం క్షీణించడంతో వ్యవసాయ కార్మికుల జీవితాలు మరింత అనిశ్చితంగా, అభద్రతాయుతంగా మారుతున్నాయి. వ్యవసాయ కార్మికులకు తగిన పని, సరైన పని పరిస్థితులు, వేతనాలు, సామాజిక భద్రతా చర్యలకు హామీ ఇచ్చే సమగ్ర కేంద్ర చట్టం కోసం డిమాండ్ చేసే కీలక సమయమిది. వ్యవసాయ కార్మికులు తమ ఉనికి కోసం పోరాటం చేయడం తప్ప వేరే మార్గం లేదు.



విశ్లేషణ

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు), అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), సిఐటియు నిర్వహిస్తున్న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీకి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు లక్షల సంఖ్యలో ఢిల్లీకి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మూడు సంఘాలు గత కొన్నేళ్ళుగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉమ్మడి పోరాటాల్ని నిర్వహిస్తున్నాయి. మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ ఒక కీలకమైన సమయంలో జరుగుతున్నందున అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. దీన్ని విజయవంతం చేయడానికి దేశ వ్యాప్తంగా భారీగా జరుగుతున్న ఏర్పాట్లలో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములవుతున్నారు.

కాంగ్రెస్ నాయకత్వంలోని గత ప్రభుత్వాలు అమలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లో అసంతృప్తిని మిగిల్చాయి. పెట్టుబడిదారీ విధానం లక్షణమైన అవినీతి చాలా విశృంఖలంగా ఉండేది. ఈ పరిస్థితుల్ని అవకాశంగా తీసుకొని, పెద్ద ఎత్తున వాగ్దానాలు చేసి బిజెపి అధికారం చేజిక్కించుకుంది. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారు. అయితే, బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవే నయా ఉదారవాద విధానాలను కొనసాగించడమే కాక వాటి అమలును కూడా వేగవంతం చేస్తున్నది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టుబడి ఉండేందుకు ప్రయత్నం చేస్తున్నది. ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి వ్యాపిస్తున్న కష్ట కాలంలో నయా ఉదారవాద విధానాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం ముమ్మరం చేసింది.


బి. వెంకట్

స్వాతంత్ర్యోద్యమ కాలంలో సమాజంలోని భిన్న వర్గాల ప్రజల సమస్యలు, డిమాండ్లు లేవనెత్తబడ్డాయి. బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు ప్రజా సమస్యలను స్వతంత్ర భారత దేశంలో పరిష్కరించాలని కూడా స్వాతంత్ర్యోద్యమ నాయకులు చర్చించారు. ఈ చర్చ భారత రాజ్యాంగ రూపకల్పనకు సహాయపడింది. స్వాతంత్ర్యోద్యమ విలువలను వారసత్వంగా పొందిన ఈ రాజ్యాంగం సమానత్వ సూత్రాల ఆధారంగా దేశ నిర్మాణానికి పూచీ పడింది. ఈ సందర్భంగానే స్వాతంత్ర్యం తరువాత అనేక చట్టాలు, సంస్థలు, పథకాల ఏర్పాటు జరిగింది. కానీ అవి నిజమైన స్ఫూర్తితో అమలు కాలేదు. అయినప్పటికీ, మన హక్కులను రాతపూర్వకంగా రాజ్యాంగం ద్వారా సాధించాం. ఆ రాజ్యాంగమే మన పోరాటాలకు ఆధారం. కార్మికవర్గం, రైతాంగం, గ్రామీణ కూలీల సంరక్షణ హామీ కోసం అనేక చట్టాలు చేశారు. సాంఘిక సంక్షేమ రాజ్య నిర్మాణాన్ని నెలకొల్పారు. అయితే కార్మికవర్గ సంరక్షణా చట్టాల్ని నీరుగార్చే క్రమంలో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్యోద్యమ విలువలకు వ్యతిరేకంగా పని చేస్తూ, సాంఘిక సంక్షేమ రాజ్య నిర్మాణాన్ని ధ్వంసం చేస్తున్నది. ఈ బిజెపి ప్రభుత్వం...డెబ్బై సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశం సాధించిన అభివృద్ధిని నాశనం చేస్తూ, భారతదేశ కార్మికవర్గం చెమటోడ్చి నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థల్ని కారుచౌకగా అమ్ముతున్నది.

బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు శ్రామికులకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఓవైపు కార్పొరేట్లు అధిక లాభాల్ని గడిస్తుంటే సామాన్య ప్రజలు పొట్టకూటి కోసం పోరాటాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా నిరంతర వ్యవసాయ సంక్షోభం, భారీ స్థాయిలో నిరుద్యోగం నెలకొనడంతో దినసరి కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి నెట్టబడ్డారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో-2021 లెక్కల ప్రకారం వ్యవసాయ రంగంలో పని చేస్తున్న 10,881 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2014 నుండి దినసరి వేతన జీవుల ఆత్మహత్యలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. 2021లో నమోదైన 1,64,033 మంది ఆత్మహత్యా బాధితుల్లోని ప్రతీ నలుగురిలో ఒకరు దినసరి వేతన కూలీ అని ఎన్‌సిఆర్‌బి తాజా నివేదిక పేర్కొంది.

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, భారత ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నది. దానితోపాటు సాంఘిక సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడం లేదు. ఎంఎన్‌ఆర్‌ఇజిఎ కు 2.72 లక్షల కోట్ల రూపాయల కేటాయింపు డిమాండ్ ఉండగా ప్రభుత్వం కేవలం 60 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం నేరం.

మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని కార్పొరేట్ శక్తులు లూటీ చేయడానికి అవకాశం కల్పిస్తూ అనేక చట్టాల్ని సవరిస్తున్నది. లేదా కొత్తగా చట్టాల్ని తెస్తున్నది. ప్రస్తుత కార్మిక చట్టాల్ని నీరుగార్చేందుకు, దారి మళ్ళించడానికి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు, ప్రభుత్వం నుండి ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా కార్మికవర్గాన్ని దోపిడీ చేయడానికి కార్పొరేట్లకు కల్పించే పూర్తి స్వేచ్ఛ తప్ప మరొకటి కాదు. మూడు వ్యవసాయ చట్టాల్ని కూడా ఈ విధమైన లక్ష్యంతోనే తీసుకొచ్చారు. ఇది వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ల ప్రవేశానికి చేసే ప్రయత్నమే. ప్రజాపంపిణీ వ్యవస్థను నాశనం చేసి, కార్పొరేట్లకు ఆహార మార్కెట్‌ను తెరవడమే ఈ కొత్త చట్టాల లక్ష్యం.

శ్రామికులు స్వాతంత్ర్యోద్యమం సాధించిన విజయాలను ఎలా కోల్పోతున్నారో చెప్పడానికి గడిచిన కొన్ని దశాబ్దాల్లో భూసంస్కరణలు ఎలా తలకిందులయ్యాయో ఉదాహరణగా చెప్పొచ్చు. స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి లక్షల సంఖ్యలో గ్రామీణ శ్రామికుల్ని ఆకర్షించిన ప్రధాన నినాదాల్లో "దున్నే వానికి భూమి" నినాదం ఒకటి. అయితే స్వాతంత్ర్యానంతరం పాలకవర్గం ప్రజల్ని వంచించింది. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్ మినహా దేశంలో ఎక్కడా భూసంస్కరణల్ని అమలు చేయలేదు.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా భారతీయ సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయి. ధనవంతులు, కార్పొరేషన్లు మరింత ధనవంతులుగా మారుతుంటే పేద ప్రజలు బతుకుదెరువుకు అవసరమయ్యే వేతనాల కోసం పోరాటాలు చేస్తున్నారు. విద్య, వైద్యం వంటి ప్రాథమిక ప్రభుత్వ సేవలు వారికి అందుబాటులో లేకుండా పోయాయి. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం 40 శాతం పైగా భారతదేశ సంపద జనాభా లోని కేవలం 1 శాతం మంది చేతిలో కేంద్రీకృతమై ఉంది. మన దేశంలో 10 మంది సంపన్నుల సంపద 2022లో 27.52 లక్షల కోట్లు పెరిగింది. దీనికి భిన్నంగా జనాభాలో దిగువనున్న 50 శాతం ప్రజలు మొత్తం సంపదలో కేవలం 3 శాతం సంపద మాత్రమే కలిగి ఉన్నారు. 2021లో 102 మందిగా ఉన్న బిలియనీర్ల సంఖ్య 2022 నాటికి 166కి పెరిగింది. ప్రపంచంలో అధికంగా దాదాపు 23 కోట్ల మంది ప్రజలు భారతదేశంలో పేదరికంలో జీవిస్తున్నారు. పైనున్న 10 శాతం వారితో పోలిస్తే, దిగువనున్న 50 శాతం మంది ప్రజలు, 10 శాతం వారు చెల్లించే పన్నుల కన్నా 6 రెట్లు పరోక్ష పన్నులు చెల్లిస్తున్నారు.

ఆహారం, ఆహారేతర నిత్యావసరాల నుండి వసూలైన మొత్తం పన్నుల్లో దిగువనున్న 50 శాతం ప్రజలు 64.3 శాతం చెల్లిస్తున్నారు.

అదేవిధంగా దేశంలో అన్ని రంగాలు దాడికి గురవుతున్నాయి. బిజెపి కుల, మత, అస్తిత్వ రాజకీయాల ఆధారంగా శ్రామికుల మధ్య అనైక్యతను సృష్టిస్తున్నది. భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైన హిందూత్వ ఎజెండాను కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అమలు చేస్తున్నది. భారతీయ సమాజంలో హిందూత్వ ప్రాజెక్టును రుద్దేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఉపయోగిస్తున్నారు. రాజ్యాంగాన్ని అమలు చేసి, దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గల వ్యక్తులే దానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ కాశ్మీర్ విభజన లాంటి చర్యలు రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాల ఉల్లంఘనలను సూచిస్తున్నాయి.

ఫాసిస్ట్ భావజాలంతో ఉన్న ఏ ప్రభుత్వమైనాసరే అసమ్మతిని, భిన్న స్వరాల్ని సహించదు. అవి ఏ రూపంలో వున్నా శిక్షిస్తుంది. దురదృష్టవశాత్తు మనం దీనిని ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారతీయ సమాజంలో చూస్తున్నాం. అనేకమంది పౌరహక్కుల కార్యకర్తలు, ప్రజా నాయకులు, వామపక్ష ఉద్యమ నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు దాడులు చేస్తున్నాయి. ఎలాంటి చార్జి షీట్లు లేకుండా అనేకమంది సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గుతున్నారు. ప్రధానమంత్రికి, తన సహచరులకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతిపక్ష పార్టీల నాయకులు కేంద్ర దర్యాప్తు సంస్థల చేతిలో బలిపశువులు అవుతున్నారు. భారతదేశంలో ఎన్నుకోబడిన నిరంకుశ ప్రభుత్వముందని అంతర్జాతీయ సంస్థలు ప్రకటించాయి.

మైనారిటీలు, దళితులు, గిరిజనులే లక్ష్యంగా నిత్యం హింసలకు పాల్పడుతున్నారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న ప్రభుత్వ పెద్దలు పథకం ప్రకారం ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. మనుస్మృతి ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి దళితులకు వ్యతిరేకంగా ఒక పద్ధతి ప్రకారం హింసను సృష్టిస్తున్నారు. దళితులకు వ్యతిరేకంగా నమోదవుతున్న నేరాల సంఖ్య పెరుగుదలలో ఇది ప్రతిబింబిస్తుంది. రిజర్వేషన్లపై కూడా తీవ్రమైన దాడి జరుగుతున్నది. అణగారిన వర్గాల వారికి బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధిస్తున్నారు. మతోన్మాద, కులోన్మాద హింసలకు బాధ్యులైన వారు వీధుల్లో స్వేచ్ఛగా విహరించేందుకు వీలు కల్పిస్తున్నారు. అంతేగాక వారి చర్యల్ని సమర్థిస్తూ బహిరంగ వేదికలపై వారిని సన్మానిస్తున్నారు. సమాజంలో అణగారిన వర్గాల వారికి అభద్రతా భావాన్ని కలిగించే విధంగా దేశంలో ద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

వ్యవసాయ రంగ నిరంతర సంక్షోభం వ్యవసాయ కార్మికుల్ని కష్టాల పాల్జేస్తున్నది. కొనసాగుతున్న ఈ వ్యవసాయ సంక్షోభం చిన్న సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నది. కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వ్యవసాయ పనిదినాలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా వ్యవసాయ కార్మికుల్లో నిరుద్యోగం పెరిగి గ్రామీణ నిరుద్యోగులు, ఇతర పేదలు వలస పోతున్నారు. ఆర్థిక సంక్షోభం ఫలితంగా మందగించిన పారిశ్రామిక వృద్ధి ఈ ప్రజలకు ప్రత్యామ్నాయ గ్రామీణ, పట్టణ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైంది. వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలు కాలానుగుణంగా పెరగడం లేదు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు, నయా ఉదారవాద విధానాల ప్రభావం వల్ల భూమి లేని, ఇళ్ళు లేని వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సాంఘిక సంక్షేమ రాజ్యం క్షీణించడంతో వ్యవసాయ కార్మికుల జీవితాలు మరింత అనిశ్చితంగా, అభద్రతాయుతంగా మారుతున్నాయి. వ్యవసాయ కార్మికులకు తగిన పని, సరైన పని పరిస్థితులు, వేతనాలు, సామాజిక భద్రతా చర్యలకు హామీ ఇచ్చే సమగ్ర కేంద్ర చట్టం కోసం డిమాండ్ చేసే కీలక సమయమిది. వ్యవసాయ కార్మికులు తమ ఉనికి కోసం పోరాటం చేయడం తప్ప వేరే మార్గం లేదు.

ఈ పరిస్థితుల్లో మన జీవనాధారాల్ని కాపాడుకోవడమే కాక లౌకిక, ప్రజాస్వామ్య, భిన్నత్వంతో కూడిన భారతదేశాన్ని రక్షించుకోవడం కూడా మనందరి బాధ్యత. ఇవే ప్రస్తుతం కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్ళు. సామాజిక సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్య పోరాటాలే దీనికి సరైన సమాధానం.

(వ్యాసకర్త అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి)

★

అదానీ కోసం

పార్లమెంటును తొక్కేస్తున్న ప్రభుత్వం

వ్యాఖ్య

ఏడు రోజుల పాటు పార్లమెంటరీ కార్యకలాపాలకు అంతరాయం కలిగిన తర్వాత, బడ్జెట్ సమావేశాల రెండో భాగాన్ని కుదించాలని ప్రభుత్వం ఇప్పుడు భావిస్తోంది. పద్దులను గిలెటిన్ చేయడం ద్వారా, ఎలాంటి చర్చ లేకుండా ద్రవ్య బిల్లును ఆమోదించడం ద్వారా సమావేశాలను కుదించడానికి ప్రయత్నిస్తోంది.

విదేశాల్లో వుండగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారతదేశంలో ప్రజాస్వామ్య స్థితిగతుల గురించి చేసిన వ్యాఖ్యలకుగాను...ఆయన క్షమాపణ చెప్పాలంటూ...మార్చి 13 నుండి పార్లమెంట్ ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది పాలక పార్టీనే. పై చర్య దీని నుంచి ఉద్భవించినదే.

అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై ఎలాంటి చర్చ జరగకుండా నివారిస్తూ, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికి ఇదంతా కేవలం ఒక సాకేనని అర్థమైపోతోంది. ఫిబ్రవరి మొదటి వారంలో, బడ్జెట్ సమావేశాల ప్రారంభం నుండి అదానీ గ్రూపునకు సంబంధించి వెలువడిన హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చ జరగాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షం గట్టిగా పట్టుబడుతూనే వుంది. అప్పటి నుండి, వివిధ షెల్ కంపెనీల్లో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ పాత్ర గురించి, అలాగే అంబుజా సిమెంట్-ఎసిసి కంపెనీల్లో ప్రమోటర్-ఇన్వెస్టర్‌గా ఆయన కార్యకలాపాల గురించి అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదానీ గ్రూపులో కీలక పెట్టుబడిదారైన ఎలారా అనే విదేశీ సంస్థ ఒక రక్షణ సంబంధమైన కంపెనీలో అదానీతో సహ యజమానిగా వుందనే దిగ్భ్రాంతికరమైన అంశం బైటపడింది. ఈ విషయాలన్నింటిపైన పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం వుంది. వివరించాల్సి వుంది. కానీ, అందుకు బదులుగా, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలంటూ పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజునే జరిగిన



దాడికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహించడం మనం చూశాం. ఎలారా వంటి కంపెనీ భారత్‌లో ఒక రక్షణ సంస్థకు అదానీతో కలిసి సహ యజమానిగా ఎలా మారిందనే కీలకమైన ప్రశ్నపై సమాధానం చెప్పకుండా దాటేయడానికి పన్నిన ఎత్తుగడేనా ఇది? రాహుల్ గాంధీకి సంబంధించినంత వరకు, ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందని, మోడీ ప్రభుత్వం దాన్ని అణచివేస్తోందంటూ ఆయన చేసిన విమర్శలన్నీ దాదాపు ప్రతిపక్ష నేతలందరూ చేసే విమర్శలే. అయితే విదేశీ గడ్డపై ఆయన ఇలా విమర్శ చేయడం దేశభక్తి కాదంటూ చేస్తున్న ఆరోపణలు బూటకమైనవి. ఎందుకంటే ప్రభుత్వ పాత్రను విమర్శించడం, ఒక దేశంపై దాడి చేయడం ఒకటి కాదు. కేంబ్రిడ్జిలో చేసిన ప్రసంగంలో అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని అమాయకంగా ప్రశంసించడంతో సహా బ్రిటన్‌లో రాహుల్ గాంధీ వ్యక్తం చేసిన అభిప్రాయాలన్నింటినీ ఎవరైనా సమర్థించాల్సిన అవసరం లేదు. కానీ దేశ విదేశాల్లో ఎక్కడైనా గానీ ప్రభుత్వ నిరంకుశవాద ధోరణిని విమర్శించే హక్కు విడదీయరానిది.

అదానీ అంశంపై బిజెపి వ్యవహారం ఆశ్చర్యం గొలుపుతోంది. ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా పలు ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో జరిగిన చర్చకు సమాధానమిచ్చే సమయంలో అదానీ పేరును ఒక్కసారి కూడా ప్రస్తావించకుండానే ప్రధాని నరేంద్ర మోడీ గంటల తరబడి మాట్లాడిన తీరు చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఇది చూస్తుంటే హారీపోటర్ పుస్తకాల్లోని అత్యంత ప్రమాదకరమైన, శక్తివంతమైన పాత్ర లార్డ్ వాల్డ్‌మార్ట్ గుర్తుకు వస్తుంది. 'అస్సలు పేరు చెప్పకూడని వ్యక్తి'గా చాలామంది అతడిని ప్రస్తావిస్తారు. ఇక మోడీ, అదానీల మధ్య సంబంధాల గురించి బయటపడకూడదంటే...నరేంద్ర మోడీ, బిజెపికి సంబంధించింత వరకు... గౌతమ్ అదానీ అటువంటి 'అస్సలు పేరు చెప్పకూడని వ్యక్తి'.

పార్లమెంట్‌లో ప్రస్తుతం అమలవుతున్న ఎత్తుగడలు చూస్తుంటే, అదానీ గ్రూపుపై పార్లమెంటరీ సమీక్ష జరగకుండా నివారించేందుకు మోడీ ప్రభుత్వం, బిజెపి ఎంత దూరమైనా వెళతాయని రుజువవుతోంది. ఇన్నేళ్ళ పాటు రెగ్యులేటరీ అధికారుల నోరు మూయించడమే కాకుండా, ఇప్పుడు అదానీ సామ్రాజ్యం గురించి, దాన్ని నిర్మించిన తీరు గురించి ప్రశ్నలు తలెత్తకుండా పార్లమెంట్ నోరు కూడా నొక్కేస్తున్నారు. చట్టానికి సంబంధించిన విధి విధానాల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వడానికి, ద్వంద్వ ప్రయోజనాలకు ఉపయోగించిన కొన్ని రుణాలను వదిలిపెట్టడానికి, హిండెన్‌బర్గ్ ఉదంతం బయటపడినప్పటి నుండి సంభవించిన నష్టాల్లో కొన్నింటినైనా భర్తీ చేసుకోవడానికి...అదానీకి, కంపెనీకి కొంత సమయం ఇవ్వాలన్నది మోడీ ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. అదానీని రక్షించడంతో పోలిస్తే పార్లమెంట్‌ను స్తంభింప చేయడమనేది పెద్ద విషయమే కాదు.

పార్లమెంట్‌ను అదేపనిగా కించపరచడం, దాని ప్రాధాన్యత లేకుండా చేయడం అనేది అదానీ వ్యవహారంలో పాలక పార్టీ మరింత వేగంగా చేసింది.


('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బాపనయ్య బాటలో...

నివాళి

అట్టడుగు దళిత కులంలో పుట్టి అంటరానితనం కారణంగా అనేక అవమానాలు భరించి, తనకు జరిగిన అవమానాన్ని కమ్యూనిస్టు నాయకుల సహకారంతో ఎదుర్కొని నిలబడ్డాడు. చిన్నతనంలో అంటరానితనంతో పాటుగా పేదరికాన్ని అనుభవించిన ఆయన అంటరానితనం, పేదరికం పోవాలంటే కమ్యూనిస్టు పార్టీయే సరైనదని భావించి... తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టుగా పని చేస్తూ ప్రజల మన్ననలను పొందాడు. అంటరానితనానికి, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఆఖరి వరకూ పోరాడిన ఆ యోధుడే గుంటూరు బాపనయ్య గారు.

కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నిర్వహించింది. దున్నే వానికే భూమి పంచాలంది. కుల వ్యవస్థకు, అంటరానితనానికి వ్యతిరేకంగా, తెలంగాణలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి పోరాటం చేసింది. ఆంధ్రాలో చల్లపల్లి జమిందార్‌కి వ్యతిరేకంగా భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదే.


నేడు బాపనయ్య 45వ వర్ధంతి

ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ ఒక శక్తిగా అవతరించి దేశదేశాల్లో విముక్తి ఉద్యమాలు నడిపింది. ఆ ప్రభావంతోనే మన దేశంలో కూడా యువత వేలాదిగా కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వ్యవసాయ కార్మికులు, పేదరైతులు, చేతివృత్తిదారులను సమీకరించి వారి ఆర్థిక సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలపై కూడా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమించింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలను ఐక్యం చేసింది. ఈ పోరాటంలో చల్లపల్లి ఏరియాలో ఆంధ్రప్రదేశ్‌లో మహత్తరమైన కృషి సల్పిన వ్యక్తి బాపనయ్య.

కామ్రేడ్ బాపనయ్య మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఎమ్మెల్యేగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పని చేస్తూ తలలో నాలుక వలె ప్రజల మధ్య గడిపారు. అగ్ర కులస్తులు కూడా బాపనయ్యను పరాయివాడిగా కాకుండా తమ వాడిగానే పరిగణించి ఆదరించేవారు. ఆ విధంగా బాపనయ్య తను నమ్మిన ఆశయాన్ని కొనసాగించారు.

ఈయన ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో 1962 జులై 13న శాసనసభలో సాంఘిక సంక్షేమ శాఖ పద్దుపై ప్రసంగించినప్పుడు దళితుల సామాజిక ఆర్థిక పరిస్థితిని కళ్లకు కట్టినట్లు వివరించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ...షెడ్యూల్ కులాల తెగల ప్రజలు తరతరాలుగా అణచివేతకు, దోపిడీకి, సాంఘిక వెలివేతకు గురవుతున్నారన్న వాస్తవాన్ని మనమంతా గుర్తించాలి. వీరి బిడ్డలు అత్యంత నికృష్ట జీవన పరిస్థితుల్లో, నిష్ఠ దారిద్ర్యంలో జీవిస్తున్నారని గమనించాలి. వీరి బతుకుల్లో వారి పరిసర ప్రాంతాల్లో నాగరికత అనేది తొంగి చూడడం లేదు. వీరి పేటలు పారిశుధ్యానికి నోచుకోవడంలేదు. అటువంటి పరిస్థితుల్లో దళితుల బిడ్డలను అగ్రవర్ణ బిడ్డలతో పోల్చడం సరికాదు. అగ్రవర్ణాలలో పేదలు ఉన్నప్పటికి దళితులు, గిరిజనలు సాంఘికంగా నేటికీ నికృష్ట వాతావరణంలో జీవిస్తున్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని...ఆయన పేర్కొన్నారు. నేటికీ దళిత గిరిజన పేటల్లో పెద్దగా మార్పు లేదు. దళిత గిరిజనులకు తాగడానికి మంచినీరు అందుబాటులో లేదు కానీ సారా, బ్రాందీలను ప్రభుత్వం అందుబాటులో ఉంచినందుకు పాలక పెద్దలు సిగ్గుపడాలి. కల్తీ సారా తాగి దళిత గిరిజనులు ఎక్కువమంది 50 సంవత్సరాల లోపే చనిపోతున్నారు. కుటుంబాలు దిక్కు లేకుండా పోతున్నాయి. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా అభివృద్ధిలో దళిత గిరిజనులు వెనుకబడే ఉన్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడం, ఖర్చు చేయడం మానేసింది. ప్రణాళిక బడ్జెట్‌కు తిలోదకాలు ఇవ్వడం ద్వారా ఈ తరగతుల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నది. మన రాష్ట్రంలోనూ గత తెలుగుదేశం ప్రభుత్వం, నేటి వైసిపి ప్రభుత్వం బడ్జెట్లో నిధులను జనాభా ప్రాతిపదికన కాకుండా తక్కువ కేటాయిస్తూ ఖర్చు చేయకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నాయి. అనేక పథకాలను అమలు చేయకుండా పక్కన పెట్టారు. రాజ్యాంగం, విద్యా హక్కు చట్ట ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్యను అమలు చేయాలని చెప్పింది. నేటికీ ఇది పూర్తిగా అమలు కాలేదు. పైగా కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం అమలు పేరుతో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయాన్ని తలపెడుతున్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, నగదీకరణ విధానాలకు వ్యతిరేకంగా, హిందుత్వ మతోన్మాద మనువాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే ఆర్థిక సమస్యల పరిష్కారంతోపాటు సామాజిక న్యాయాన్ని సాధించగలం. ఇందుకు కృషి చేయడం ద్వారానే కామ్రేడ్ బాపనయ్య ఆశయాన్ని నెరవేర్చగలం.

- దడాల సుబ్బారావు
వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు.

మత మార్పిడి నిరోధక చట్టం కేసుల్లో
బలవంతపు చర్యలు వద్దు

● యుపి ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ మత మార్పిడి నిరోధక చట్టం కింద నమోదైన ఎఫ్ఐఆర్ ప్రాతిపదికగా ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా క్రైస్తవ కమ్యూనిటీ సభ్యులకు సుప్రీం కోర్టు రక్షణ కల్పించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావె వాదనలు వినిపిస్తూ, మూకుమ్మడి మత మార్పిడికి సంబంధించిన ఎఫ్ఐఆర్ ఒక కట్టుకథ అని అన్నారు. పోలీసు చర్య అనేది చట్ట ప్రక్రియ యొక్క దుర్వినియోగమని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. "పోలీసులు గానీ, మేజిస్ట్రేట్లు గానీ మాకు రక్షణ కల్పించడం లేదు. మీరు మాత్రమే మమ్మల్ని కాపాడగలరు. బలవంతపు మత మార్పిడులను వారు ఆరోపిస్తున్నారు. పిల్లలను అరెస్టుచేస్తున్నారు. అర్ధరాత్రుళ్ళు విడిచిపెడుతున్నారు." అంటూ డాక్టర్ మాథ్యూ శామ్యూల్ నేతృత్వంలోని పిటిషనర్ల తరపున దుష్యంత్ దావె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సంఘటనలో ఒక వ్యక్తిపై అనేక ఎఫ్ఐఆర్‌లను పోలీసులు నమోదు చేశారని తెలిపారు. ఒక వ్యక్తిని ఒకే నేరానికి ఒకసారి కన్నా ఎక్కువసార్లు ప్రాసిక్యూట్ చేయరాదు, శిక్షించరాదని పేర్కొంటు న్న రాజ్యాంగంలోని 20(2) అధికరణను పోలీసులు ఉల్లంఘించారని అన్నారు. దానిపై చంద్రచూడ్ స్పందిస్తూ, తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని స్టే విధిస్తూ పోలీసులకు నోటీసులు జారీ చేశారు.

అదానీ నుండి దృష్టి మరల్చేందుకే!

పార్లమెంట్‌ను బిజెపి స్తంభింప చేయడంపై ఏచూరి విమర్శ



పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

హోషియార్‌పూర్ : సర్దార్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 92వ అమరవీరుల దినోత్సవం, గొప్ప కమ్యూనిస్టు నేత, సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సుర్జిత్ 107వ జయంతి, స్వాతంత్య్ర దినోత్సవాల 75ఏళ్ళ పండుగను పురస్కరించుకుని పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో గురువారం బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని, దేశభక్తులు, స్వాతంత్య్ర సమరయోధులకు ఘనంగా నివాళి అర్పించారు. బ్రిటీష్ కాలం నాటి పాత డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ వద్ద బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ యువ శక్తికి ప్రతీక అని, అనేక తరాలకు స్ఫూర్తిని అందించారని పేర్కొన్నారు. మనం స్వేచ్ఛ పొందడమైతే పొందాం కానీ, ప్రతి ఒక్క పౌరుడు ఆర్థిక స్వేచ్ఛ పొందడానికి రాజకీయ స్వేచ్ఛ సంపూర్ణం కావాలని భగత్ సింగ్ ఎల్లప్పుడూ చెబుతూ వుండేవారని ఏచూరి పేర్కొన్నారు. అవిశ్రాంతంగా మనం జరిపే పోరాటాల ద్వారా ఈ స్వేచ్ఛను సాధించడానికి కమ్యూనిస్టులుగా మనం కృషి చేస్తూనే వున్నామన్నారు. సంపన్నులు, పేదల మధ్య చాలా వ్యత్యాసం వుందని, ఒక శాతం భారత కార్పొరేట్లు 44.5శాతం జాతీయ ఆస్తులపై నియంత్రణను కలిగివున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థల రుణాలను రూ.11లక్షల కోట్ల మేరకు మోడీ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు.

పార్లమెంట్ కార్యకలాపాలను పాలక పార్టీ స్తంభింపచేయడం ఇదే మొదటిసారని ఏచూరి అన్నారు. పార్లమెంట్ కార్యకలాపాలను బిజెపి స్తంభింపచేయడం వెనుక గల అసలైన కారణం విదేశాల్లో రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ కాదని, అదానీ కుంభకోణాల నుండి దేశం దృష్టిని మళ్ళించాలని, ఈ కుంభకోణంలో జెపిసి దర్యాప్తును నివారించాలని వారు అనుకున్నారని ఏచూరి విమర్శించారు. మూతపడిన పరిశ్రమలను తిరిగి తెరిపించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లైతే, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసినట్లైతే, కోట్లాదిమంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం చేయడాన్ని ఆయన ఖండించారు. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా చర్య తీసుకున్నా దాన్ని జాతి వ్యతిరేక చట్టంగా బిజెపి, పోలీసు బలగాలు పేర్కొంటున్నాయన్నారు. మోడీ హటావో దేశ్ బచావో' అన్న పోస్టర్లపై ఢిల్లీ పోలీసులు 200 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని ఏచూరి వెల్లడించారు. మొత్తంగా 3500 ఇడి కేసుల్లో కేవలం 23 కేసులు మాత్రమే కోర్టు విచారణకు వెళ్ళాయని చెప్పారు. మతోన్మాదమనే విషాన్ని వ్యాప్తి చేస్తున్న ఫాసిస్ట్ సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఏచూరి విమర్శించారు. "హిందూ ముస్లిం, సిక్, ఇసాయి, చారోం భారత్ కే సిపాయి" వంటి నినాదాలను దేశావారమంటూ ఏచూరి తన స్కూలు రోజులను గుర్తు చేసుకున్నారు. 1980ల్లో పంజాబ్‌లో మతోన్మాద, తీవ్రవాద శక్తులపై పోరాట సమయంలో 200మందికి పైగా సిపిఎం కార్యకర్తలు, నేతలు తమ ప్రాణాలను త్యాగంచేశారని అన్నారు. న్యాయవ్యవస్థపై నిరంతరంగా దాడి చేస్తున్న బిజెపి మంత్రులను, నేతలను ఏచూరి విమర్శించారు. సిబిఐ, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు నిర్ణయాన్ని చారిత్రాత్మకమైనదని, ఎన్నికల ప్రజాస్వామ్య క్రమాన్ని కాపాడేందుకు తీసుకున్న చర్య అని ఏచూరి వ్యాఖ్యానించారు. రైతాంగాన్ని అభినందిస్తూ, సంయుక్త కిసాన్ మోర్చా ఢిల్లీలో సాగించిన పోరాటం చారిత్రాత్మకమైనదని అభివర్ణించారు.

బిజెపి, మోడీకి చెందిన కొద్దిమంది పెట్టుబడిదారులైన మిత్రులు గరిష్టంగా లాభాలు ఆర్జించేందుకు గానూ 80శాతానికి పైగా ప్రజలను ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారని, దీన్నుండి, మతోన్మాదం నుండి దేశాన్ని కాపాడేందుకు ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలోని మతోన్మాద, కార్పొరేట్ కూటమికి వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలని ఏచూరి పిలుపిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సుఖ్వీందర్ సింగ్ షెకాన్, మాజీ కేంద్ర మంత్రి, దేశ్ భగత్ యాద్గర్ కమిటీ ప్రధాన కార్యదర్శి బల్వంత్ సింగ్ రామూవాలియాలు కూడా ర్యాలీనుద్దేశించి ప్రసంగించారు.

సిబిఐ, ఇడి దుర్వినియోగంపై
సుప్రీంను ఆశ్రయించిన 14 ప్రతిపక్షాలు

● 5న విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఏజెన్సీలు సిబిఐ, ఇడి రాజకీయ దుర్వినియోగంపై ప్రతిపక్షాలు న్యాయపోరాటానికి సిద్ధమైయ్యాయి. రాజకీయ కుట్రలో భాగంగా సిబిఐ, ఈడి వంటి కేంద్ర సంస్థలను మోడీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు తాజాగా ఈ విషయంపై ఉమ్మడిగా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల వివక్షపూరిత ప్రయోగానికి వ్యతిరేకంగా 14 రాజకీయ పార్టీలు శుక్రవారం సుప్రీంకోర్టు పిటిషన్ దాఖలు చేశాయి. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అత్యవసర జాబితా కోసం ప్రస్తావించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సిజెఐ జస్టిస్ డి. వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, ఏప్రిల్ 5న విచారణ చేపట్టేందుకు అంగీకరించింది. ముందస్తు అరెస్టు మార్గదర్శకాలు, వాటిని అమలు చేయాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయని, నేడు సిబిఐ, ఈడిలు పూర్తిగా ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలకు వ్యతిరేకంగా ఉపయోగించబడుతోందని అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. సిబిఐ, ఈడి ఏకపక్ష చర్యలకు వ్యతిరేకంగా మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిఆర్ఎస్, టిఎంసి, ఆప్, జెడియు, ఆర్‌జెడి, ఎస్‌పి, ఎన్‌సిపి, డిఎంకె, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జెఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సంయుక్తంగా ఈ పిటిషన్ దాఖలు చేశాయి.

బిజెపి ప్రత్యర్థులే లక్ష్యం

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) వంటి దర్యాప్తు సంస్థలు.. కేవలం బిజెపి ప్రత్యర్థులనే లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఈ పిటిషన్‌లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. "మొత్తం రాజకీయ ప్రతిపక్షాలను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకొని, వారి గొంతెను అణిచివేసి, ఎక్కువ కాలం జైలుకు పంపడానికి దర్యాప్తు ఏజెన్సీలు పని చేస్తున్నాయి. చాలా తక్కువ నేరారోపణలు ఉన్నప్పటికీ బెయిల్‌ను రాకుండా క్రూరమైన ప్రత్యేక చట్టాలను (మనీ లాండరింగ్ నిరోధక చట్టం, 2002 వంటివి) తరచుగా ఉపయోగిస్తున్నాయి" అని పిటిషన్‌లో పేర్కొన్నాయి. "2014 నుంచి ఈడి నమోదు చేసిన కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, వీటిలో ఎక్కువ భాగం మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిని లక్ష్యంగా చేసుకొని కేసులు నమోదు చేస్తుంది. అయినప్పటికీ, నేరారోపణ రేటు చాలా తక్కువగా ఉంది. పిఎంఎల్ఎ కింద కేవలం 23 నేరారోపణలు మాత్రమే నమోదు అయ్యాయి. చాలా కేసులు ప్రీ-ట్రయల్, ట్రయల్ దశలో పెండింగ్‌లో ఉన్నాయి" అని పిటిషన్‌లో పేర్కొన్నాయి.

"2004-14 మధ్యకాలంలో 72 మంది రాజకీయ నేతలపై దర్యాప్తు జరిపిన సిబిఐ కూడా, వీరిలో 43 మంది ప్రతిపక్షాలకు చెందిన వారు ఉన్నారు. 2014 తరువాత మొత్తం 124 మంది నేతల్లో 118 మంది ప్రతిపక్ష నేతలు ఉన్నారు. అంటే 95 శాతం కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. 2014 తరువాత వేధింపుల సాధనంగా సిబిఐ, ఈడి పనికిమాలిన దాడులను చేస్తున్నాయి" అని పిటిషన్‌లో తెలిపాయి.

బిజెపిలో చేరితే కేసుల విచారణ ఉండదు

ఒకవేళ సిబిఐ, ఈడి కేసులు ఎదుర్కొంటున్న నేతలు బిజెపిలో చేరితే, ఆ తరువాత వారిపై ఉన్న కేసులు ముగిసిపోతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పి. చిదంబరం, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్, సంజయ్ రౌత్ తదితర ప్రతిపక్ష నేతలను ఏజెన్సీలు అరెస్టు చేశాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి.

కానీ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, కేంద్ర మంత్రి నారాయణ్ రాణే, పశ్చిమ బెంగాల్ బిజెపి నేత సువేందు అధికారి వంటి వారు బిజెపిలో చేరిన తరువాత వారికి రహస్యంగా క్లీన్ చిట్ ఇచ్చారని, వారిపై కేసులు విచారణ నత్త నడకగా సాగుతోందని తెలిపాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పై ఉన్న కేసుల విచారణ జరగటం లేదని పేర్కొన్నారు. "95 శాతం కేసులు ప్రతిపక్షాలపైనే. అరెస్టుకు ముందు, తరువాత దర్యాప్తు సంస్థలు పాటిస్తున్న మార్గదర్శకాలు ఏమిటీ?" అని ప్రతిపక్ష పార్టీలు ఈ పిటిషన్‌లో ప్రశ్నించాయి. అరెస్టు, రిమాండ్, బెయిల్‌పై చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, కోర్టులకు మార్గదర్శకాలను రూపొందించాలని కోరాయి.



నూతన పెన్షన్ బిల్లుకు వ్యతిరేకంగా పారిస్‌లో జరిగిన నిరసన ప్రదర్శన దృశ్యం

మాక్రాన్ పట్ల పెల్లుబుకుతున్న ఆగ్రహం!

పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అమలు చేయతలపెట్టిన పెన్షన్ సంస్కరణల పట్ల దేశంలో ఆందోళనలు,నిరసనలు కొనసాగుతునే వున్నాయి. గురువారం కూడా పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బ్రిటన్ రాజు చార్లెస్ 3 పర్యటన కూడా వాయిదా పడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అధికారిక పర్యటనలో ఆదివారం రావాల్సి వుంది. శుక్రవారం ప్రధానమైన ఆందోళన లు ఎక్కడా జరగకపోయినా రైళ్ళ రాకపోకలకు అక్కడక్కడా అంతరాయం కలిగింది. మార్సెల్లె వాణిజ్య ఓడరేవులో సరుకుల ట్రక్కులను అడ్డుకు న్నారు. గురువారం నాటి ప్రజా ఆందోళనల నేపథ్యంలో వెయ్యికిపైగా చెత్తబుట్టలను తగలబెట్టడంతో పారిస్ వీధులన్నీ గందరగోళంగా వున్నాయి. వారాల తరబడి సాగుతున్న సమ్మెలతో పేరుకుపోయిన చెత్తబుట్టలన్నీ నిరసనలకు గుర్తుగా మారాయి. ఇప్పటివరకు 450మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మొత్తంగా 300కి పైగా ప్రదర్శనలు జరిగాయి. పెన్షన్ సంస్కరణలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో 10లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. కాగా కొన్ని ప్రదర్శనల్లో హింస చెలరేగిందని, ఆ సందర్భంగా 440మంది పోలీసులు గాయపడ్డారని హోం మంత్రి గెరాల్డ్ డర్మానిన్ తెలిపారు. పదవీ విరమణ వయస్సును 62 నుండి 64కి పెంచుతూ మాక్రాన్ ప్రభుత్వం తీసుకువచ్చిన పెన్షన్ బిల్లును మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అయితే వ్యవస్థను సుస్థిరంగా వుంచాలంటే ఈ చర్య తప్పదని మాక్రాన్ చెబుతున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

భావప్రకటనా స్వేచ్ఛ అంతమైపోయిందని, త్వరలోనే నియంతృత్వంలోకి వెళ్లిపోతామేమోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల గొంతులను అణిచివేసేందుకు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు.

ఉభయ సభల్లో ఆందోళన

అంతకుముందు పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యుల ఆందోళన కొనసాగింది. 'మోడీ-అదానీ భాయ్ భాయ్, అక్రమాలపై జెపిసి వేయాలి' వంటి నినాదాలతో ప్రతిపక్షాల సభ్యులను పార్లమెంటును మార్మోగించారు. పార్లమెంట్‌లో అదానీ-హిండెన్బర్గ్ వ్యవహారం, రాహుల్ గాంధీకి జైలు శిక్ష తదితర అంశాలపై ప్రతిపక్ష పార్టీ ఎంపిలు శుక్రవారం ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే సభలు వాయిదా పడ్డాయి. ప్రతిపక్ష ఎంపిల ఆందోళన మధ్య ఆర్థిక బిల్లుని ఆమోదించారు.

కొలంబియా, వెనిజులా అధ్యక్షుల భేటీ

కారకాస్ : ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే చర్యల్లో భాగంగా కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో, వెనిజులా ప్రెసిడెంట్ నికోలస్ మదురో గురువారం కారకాస్‌లో సమావేశమయ్యారు. ఈమేరకు వెనిజులా అధ్యక్షభవనం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ సమావేశం ఇరు దేశాల పరస్పర గౌరవం, పర్సర అంగీకారంతోపాటుగా స్వీయ నిర్ణయాలు తీసుకునేందుకు ఇరు దేశాధ్యక్షుల వర్కింగ్ మీటింగ్ దోహదపడుతుందని ప్రకటన పేర్కొంది. అలాగే ఇరు దేశాల మధ్య పెట్టుబడుల రక్షణ కోసం ఇటీవల సంతకం చేసిన ఒప్పందాన్ని సమీక్షించడానికి, వాణిజ్య మార్పిడిని బలోపేతం చేసేందుకు తీసుకునే చర్యలపై ఈ సమావేశంలో చర్చించిచారు.





మీకోసం

టమాటాలను కోసేటప్పుడు రసం కారకుండా ఉండాలంటే.. పళ్లున్న కత్తిని ఉపయోగించాలి.

జీవన సౌరభం

ప్రవర్తన అద్దం లాంటిది. ప్రతి వ్యక్తి ప్రతిబింబం దానిలో కనిపిస్తుంది.

పాపాయి




నీటిలో కలువవే మా పాప నువ్వు
నింగిలో వెన్నెలై వెలుగు నీ నవ్వు
మా అందరి కనుపాపవు నువ్వు
మా ఇంట వెలసిన మహిమాన్వితవు నువ్వు!

నీ చిట్టి పలుకులే మాకు కులుకులు
నీ ఆటపాటలే మాకు కనువిందులు
నీ చిలిపి చేష్టలే మాకు ఆటవిడుపులు
నీ చూపులే మాకు చల్లని వెన్నెల కిరణాలు!

మా పాపే మా ఇంటి వెలుగు
నీ ఉంటే తీరుతుంది సిరులు లేని కొరత
నిను గాంచిన తొలగును చింత
నీ స్పర్శతో కలుగు ఒకింత పులకింత!

- ఆళ్ల నాగేశ్వరరావు
74166 38823.

బొమ్మ గీయండి!



చిన్నారులూ , ఈ రోజు అందమైన జిరాఫీ పిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం.
ఈ బొమ్మలో ఇచ్చిన అంకెలు ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ



ఎం. హారిక,
2వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మట్టిలో మాణిక్యాలు

క్రికెట్ ఆటలో బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ప్రత్యర్థిపై వీలైనన్నీ ఎక్కువ పరుగులు తీయాలి. సమయస్ఫూర్తితో వికెట్ కొట్టాలి. ఇవన్నీ చేయాలంటే ఎంతో బలంగా ఉండాలి. మరి వీరంతా ఆడపిల్లలు. అందులోనూ పూర్తిస్థాయి చూపు లేనివారు. ఎంతో సంకల్పం, సాధనా, పట్టుదలతో ఏదైనా చేయొచ్చని నిరూపించారు. జాతీయస్థాయి జట్టుకు ఎంపికై స్ఫూర్తిదాయకంగా నిలిచారు.



ఒడిశాలో బాలేశ్వర్ జిల్లాకు చెందిన ఈ ఐదుగురు మహిళా క్రికెటర్లకూ కంటిచూపు లేదు. వీరంతా ఒకరిపై ఆధారపడకుండా తమ పనులు తాము చేసుకోవడమే గొప్ప అనుకునే పరిస్థితి నుంచి, క్రికెట్‌లో రాణిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని విజయం సాధించడమే కాకుండా క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా టీంకు ఈ అమ్మాయిలు ఎంపికయ్యారు. భవిష్యత్తులో జాతీయస్థాయి జరిగే పోటీలో పాల్గొని నేపాల్ టీంతో తలబడనున్నారు. సోరెన్, జమునారాణి, బసంతి హన్స్దా, జిల్లి, పద్మిని.. ఈ స్థాయికి రావటానికి ఎంతో సాధన చేశారు. వీరంతా పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలు. అయినా లక్ష్య సాధనలో పేదరికం అడ్డుగోడలవ్వలేదు. క్రికెట్ మీద ఉన్న ఇష్టం, పట్టుదలతో చేసిన సాధన, దీక్షే ఇక్కడవరకూ తీసుకొచ్చాయి.

పేదరికంలోనూ...

టీం కెప్టెన్ అయిన సోరెన్, సలామణి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన అమ్మాయి. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. పనికి వెళితేనే ఇల్లు గడిచే స్థితి. సోరెన్ పుట్టుకతోనే అంధురాలు కాదు. బాల్యంలో ఓ ప్రమాదంలో ఎడమ కన్ను కోల్పోయింది. దాంతో భద్రక్‌లోని ప్రత్యేక అవసరాలు ఉన్న పాఠశాల్లో చేర్పించారు తల్లిదండ్రులు. అక్కడే ఉంటూ సోరెన్ చదువుకుంటుంది. బాల్యంలో ఆమె ఎదుర్కొన్న అవమానాలే– జీవితంలో ఏదో ఒకటి సాధించాలన్న కసిని రగిలించాయి. బాగా చదువుతూ ఫస్ట్‌క్లాస్‌లో నిలుస్తోంది. క్రికెట్ అంటే ఆమెకు చాలా ఇష్టం. టీవీలో మ్యాచ్ ఎప్పుడు వచ్చినా ఎంతో ఆసక్తితో చూస్తూ ఉండేది. భవిష్యత్తులో ప్రొఫెషనల్ క్రికెటర్‌గా స్థిరపడాలనే ఆశ ఆమెను ముందుకు నడిపిస్తోంది.

బసంతి హన్స్దాకు బాల్యంలో ఎడమ కంటిలో సూది గుచ్చుకుని చూపు కోల్పోయింది. అప్పటి నుంచి ఒక కంటి చూపుతో తన పనులన్నీ చేసుకోవడానికి చాలా రోజులు కష్టపడింది. ఈమె తల్లిదండ్రులు వలస కార్మికులు. వేరే ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నారు. అక్కడ పనులు అయిన తర్వాత తిరిగి ఊరికి వస్తారు. వచ్చిన ఆదాయం మీద కుటుంబం ఆధారపడి ఉంది. భువనేశ్వర్‌లో రమాదేవి మహిళా కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సంపాదించా లనుకుంటుంది. టీంలో ఈమె ఆల్ రౌండర్. జిల్లి చిన్న వయస్సులో ఓ ప్రమాదంలో తల్లిని, కొన్నాళ్లకు తండ్రిని కోల్పోయింది. అమ్మమ్మ పెంచి పెద్ద చేసింది. స్కూలు సెలవు రోజుల్లో అమ్మమ్మతో కలిసి పొలం పనులకు కూడా వెళు తోంది. కంటిచూపు మందగించటంతో పాటు, ఎముకల పెళుసు వంటి దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతోంది. అయినా క్రికెట్ మీద ఉన్న మక్కువతో సమస్యలను అధిగమించి ఆడుతోంది. వీరంతా నిరు పేద కుంటుంబాల నుంచి వచ్చినా చదువులోగానీ, ఆటలో నిరుత్సాహాన్ని కనబరచలేదు. ప్రత్యర్థి టీంపై గెలవాలన్న పట్టుదలతో ఆడేవారు. వీరిని కోచ్ ఇక్బాల్ జాఫర్ గుర్తించి, వెన్ను తట్టి ప్రోత్సహించారు.



క్రికెటే ప్రాణంగా

ఓ రోజు కోచ్ జాఫర్ మగపిల్లలకు క్రికెట్ ఆడిస్తున్నాడు. అది చూసిన సోరెన్ ఆసక్తిగా 'మేము క్రికెట్ ఆడలేమా, సార్' అని ప్రశ్నించింది. ఆ మాటకు ఆశ్చర్యపోయిన కోచ్ మరుసటి రోజు నుంచి అమ్మాయిల చేత కూడా ఆడించడం మొదలుపెట్టాడు. అలా నాలుగు సంవత్సరాల క్రితం వీరంతా క్రికెట్ బ్యాట్, బాలు పట్టారు. అప్పటి నుంచీ కఠోర సాధన చేశారు. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం గ్రౌండ్‌లో వర్క్ ఔట్స్ చేశారు. ప్రత్యర్థి వేసే బాల్స్‌ను ఏ విధంగా గమనించుకోవాలో సూచనలు, జాగ్రత్తలు పాటిస్తూ కోచ్ దగ్గర శిక్షణ తీసుకున్నారు. మొదట్లో చాలా ఇబ్బందులు పడ్డారు. బాలు ఎటునుంచి వస్తుందో అర్థంకాక అయోమయస్థితిలో ఉండిపోయారు. అప్పుడు కోచ్ బాలు సైజు పెంచి, శబ్దం చేసేలా బాలులో అమర్చాడు. దాంతో బాలికలకు రోలింగ్ చేయడం సులభం అయింది. మరొక కోచ్ దేబాశిష్ జెనా చేత మెలకువలు నేర్పించారు. సంవత్సరం తర్వాత స్కూల్లోనే భువనేశ్వర్‌లో జరిగిన జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొని మెడల్స్ సాధించారు. అత్యుత్తమ క్రీడాకారులుగా గుర్తింపు సాధించారు. మూడేళ్ల క్రితం జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొని రాష్ట్ర తరపున ఆడారు. సహజంగా క్రికెట్ అంటే అబ్బాయిలు ఆడే ఆటగా చూసిన జనం వీరి ఆటను చూసిన తర్వాత ఎవరైనా ఆడొచ్చు అనే వాతావరణాన్ని సృష్టించారు ఈ బాలికలు.

20 ఏళ్లగా అంతర్జాతీయ స్థాయిలో పురుషులకు అంధుల క్రికెట్ పోటీ ఉన్నప్పటికీ, బాలికలకు ఆ అవకాశం లేదు. కాని 2019లోనే క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా (CABI) మహిళల కోసం మొట్టమొదటి జాతీయ టోర్నమెంట్‌ను నిర్వహించింది. దాంతో వీరిలో ఆశలు చిగురించాయి. అప్పటి నుంచీ అంతర్జాతీయస్థాయి టోర్నమెంట్స్‌లో పాల్గొని పతకం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు జాతీయ టీంకు సెలక్టు అయ్యి విజయానికి తొలి మెట్టు ఎక్కారు.

ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం

- సంక్షేమ కేలండరు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ద్రవ్య వినిమయ బిల్లును శాసనసభ శుక్రవారం ఆమోదించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా మ్యానిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేస్తోందని చెప్పారు. సామాజిక పింఛన్ల కింద వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు, మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, సామాజిక న్యాయ బడ్జెట్‌లను నాలుగేళ్లుగా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఏటా బడ్జెట్‌తోపాటు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ స్కీమ్ డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తున్నామో అన్న సంక్షేమ కేలండర్‌ను కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత విడుదల చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ కేలండర్‌ను కూడా విడుదల చేశారు. జనవరి 2024లో వైఎస్‌ఆర్ రైతుభరోసా పిఎం కిసాన్‌కు సంబంధించిన మూడో విడత చెల్లింపులతోపాటు వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమం కూడా ఉంటుందని సిఎం పేర్కొన్నారు. జగనన్న తోడు పథకానికి సంబంధించి వడ్డీలేని రుణాలందించే కార్యక్రమం, వైఎస్‌ఆర్ లా నేస్తం రెండో విడత ఇన్‌స్టాల్‌మెంట్ అందిస్తామని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో విద్యాదీవెన, కల్యాణమస్తు, షాదీతోఫా నాలుగోవిడత, వచ్చే మార్చిలో ఇబిసి నేస్తం అమలు చేస్తామన్నారు.

ముగిసిన అసెంబ్లీ, 27 బిల్లులకు ఆమోదం

బడ్జెట్ సమావేశాలు ఈ నెల 15 నుంచి 24 వరకూ ఎనిమిది రోజులపాటు జరిగాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ తెలిపారు. శుక్రవారంతో ఈ సమావేశాలు ముగిశాయని ప్రకటించారు. శాసనసభ మొత్తమ్మీద 43.12 గంటలు జరిగిందని, 69 ప్రశ్నలకు మౌఖికంగా సమాధానం చెప్పారని చెప్పారు. 29 స్టార్ ప్రశ్నలతోపాటు రెండు అన్‌స్టార్ ప్రశ్నలను సభ ముందు ఉంచామన్నారు. సభలో ప్రవేశపెట్టిన 27 బిల్లులు ఆమోదం పొందాయన్నారు. బిల్లులపై సభలో 17 మంది సభ్యులు ప్రసంగించారని, స్వల్పకాలిక చర్చలు రెండు జరిగాయని స్పీకర్ తెలిపారు. ప్రభుత్వ తీర్మానాలు మూడు అని చెప్పారు. అసెంబ్లీలో వైసిపి 151 మంది, టిడిపి 23 మంది, జనసేన ఒకరు హాజరయ్యారని తెలిపారు.

డప్పు కళాకారులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి

విజయవాడలో ఎపిడికెఎస్ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితుల వృత్తి కళ అయిన డప్పు కళ.. పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతోందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం (ఎపిడికెఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డప్పుల దరువుతో విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా నిర్వహించారు. ఎపిడికెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండిమెడ క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పోరాటం ద్వారా 2019లో వచ్చిన రూ.3 వేల పెన్షన్‌ను ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదన్నారు. తక్షణమే రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారుల పెన్షన్ వయోపరిమితిని 45 ఏళ్లకు తగ్గించాలన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. డప్పు కళాకారులు, చర్మకారులకు డిజిటల్ సర్టిఫికెట్ పేరుతో పెన్షన్ నమోదు ప్రక్రియను ఆపుతున్నారని తెలిపారు. సర్టిఫికెట్ ఇవ్వకుండా పెన్షన్ నమోదును నిలిపివేయడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగానే పెన్షన్ నమోదు చేయించుకోవాలని డిమాండ్ చేశారు. వయసుతో సంబంధం లేకుండా డప్పు కళాకారులందరికీ డప్పు, గజ్జలు, డ్రెస్ ఇవ్వాలని, ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవకాశం కల్పించాలన్నారు. రెండెకరాల భూమి, రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. తుంగభద్ర పుష్కరాలు ముగిసి ఏడాదిన్నర అవుతున్నా ప్రదర్శనలు ఇచ్చిన 60 మంది డప్పు కళాకారులకు రెమ్యూనరేషన్, ప్రయాణ ఛార్జీలు ఇవ్వలేదన్నారు. సమస్యలపై చర్చించి పరిష్కరించకుంటే గ్రామ గ్రామాన డప్పే ఆయుధంగా ఎండగట్టి తిరుగుబాటు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సంఘం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు బి కరుణాకర్, చిత్తూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కార్యదర్శులు కన్నన్, కుటుంబరావు, నంద్యాల జిల్లా నాయకులు సుంకన్న, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్ర, వివిధ జిల్లాల నాయకులు విజయమ్మ, మామడికాయల రాజు, మద్దిలేటి రామాంజనేయులు, చిన్న రాముడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సిసిఆర్‌సి చట్టాన్ని సవరించాలి

ఎపి కౌలు రైతు సంఘం వినతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పంట సాగుదారుల హక్కుపత్రం (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు, సిసిఆర్‌సి) చట్టాన్ని సవరించాలని, భూ యజమాని అనుమతి లేకుండా గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు కోరారు. ఒసి రైతులకు రైతు భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితోపాటు కొంతమంది మంత్రులను, పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, వైసిపి ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్య వరప్రసాద్, రవీంద్రకుమార్, టిడిపి శాసనసభా పక్షం నేతలను వారు శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. సిసిఆర్‌సి చట్ట సవరణ చేయడంతోపాటు రైతు భరోసా, పంట రుణాలు, ఇ–క్రాప్ బుకింగ్, పంటల బీమా, ప్రకృతి నష్టపరిహారం ఇవ్వాలని, పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే సౌకర్యం కల్పించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభలో తీర్మానించినట్లు వివరించారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, సొంత భూమి లేని కౌలు రైతులు 10 లక్షల నుంచి 12 లక్షల మంది ఉన్నారని ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిటీ అధ్యయనంలో తెలిసిందని పేర్కొన్నారు. మొత్తం సాగుభూముల్లో 80 శాతం కౌలు రైతులు పంటలు పండిస్తున్నారని వివరించారు. 6.50 లక్షల మంది కౌలు రైతులకు రూ.6,500 కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకుని, నాలుగు లక్షల మందికి మాత్రమే సిసిఆర్‌సిలు జారీ చేశారని, 81 వేల మందికి రూ.669 కోట్లు మాత్రమే రుణాలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ రాయితీలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తోడ్పడాల్సిందిగా కోరారు.

విశాఖలో సినీ తారల క్రికెట్ సందడి

- సిసిఎల్ లీగ్‌లో ఫైనల్‌కు చేరిన భోజ్‌పురి దబాంగ్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని ఎసిఎ – విడిసిఎ క్రికెట్ స్టేడియంలో సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) సెమీ ఫైనల్స్ నేపథ్యంలో శుక్రవారం సినీ తారల సందడి నెలకొంది. తమ అభిమాన తారాగణాన్ని చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. మొదటి సెమీ ఫైనల్ పోటీలో ముంబయి హీరోస్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన భోజ్‌పురి దబాంగ్స్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబయి హీరోస్ మొదటి ఇన్నింగ్స్ 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 109 పరుగులు చేయగా భోజ్‌పురి దబాంగ్స్ మొదటి ఇన్నింగ్స్ 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేయడంతో ముంబయి హీరోస్‌కు 29 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబయి హీరోస్ 9.5 ఓవర్లలో 62 పరుగులకు ఆలౌటై భోజ్‌పురి దబాంగ్స్‌కు 92 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో ఇన్నింగ్స్‌కు 92 పరుగులు అవసరమైన తరుణంలో చివరి బంతి వరకు పోరాడిన భోజ్‌పురి దబాంగ్స్ చివరి బంతికి అజ్గర్ సిక్స్ కొట్టడంతో విజయం సాధించింది. దీంతో భోజ్‌పురి దబాంగ్స్ ఫైనల్‌కు అర్హత సాధించింది.





కొనసాగుతున్న తెలుగు వారియర్స్, కర్ణాటక బుల్డోజర్స్

అనంతరం తెలుగు వారియర్స్, కర్ణాటక బుల్డోజర్స్ మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక బుల్డోజర్స్ మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేయగా కడపటి వార్తలందేసరికి తెలుగు వారియర్స్ మొదటి ఇన్నింగ్స్‌లో 2.2 ఓవర్లు పూర్తయ్యే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 22 పరుగులు చేసింది. విక్టరీ వెంకటేష్, శ్రీకాంత్, విశ్వక్‌సేన్ తదితరులు స్టేడియంలో సందడి చేశారు.

అవాస్తవాలు, అబద్ధాల వేదికగా అసెంబ్లీ

టిడిపి నేతలు ధూళిపాళ్ల, బోండా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన అసెంబ్లీని అధికార పార్టీ అవాస్తవాలు, అబద్ధాలకు వేదికగా మార్చిందని టిడిపి మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. జగన్, ఆయన మంత్రివర్గం టిడిపిపై బురదజల్లడానికి, చంద్రబాబుకు అవినీతి మరకలు అంటించడానికి తాపత్రయపడుతోందని విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు, రాష్ట్ర సమస్యలను జగన్ పట్టించుకోవడం లేదన్నారు.

జగన్ అసమర్థతతో పోలవరం ప్రాజెక్టులో రూ.2 వేలకోట్లు వృథా అయ్యాయని టిడిపి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అబద్ధాలతోనే అసెంబ్లీలో సరిపుచ్చారని అన్నారు.

మాలకొండయ్యపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఎఎస్ అధికారి పూనం మాలకొండయ్య కోర్టు విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయబోతే ప్రభుత్వ న్యాయవాది వినతితో వెనక్కి తగ్గింది. అసెంబ్లీ సమావేశాల కారణంగా పని ఒత్తిడిలో ఉన్నారని, తుదుపరి విచారణకు హాజరవుతారని చెప్పారు. దీంతో ఈ నెల 31న జరిగే విచారణకు హాజరుకావాలని జస్టిస్ ఎం గంగారావు, జస్టిస్ డి వెంకటరమణతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తనకు జీతం చెల్లించడం లేదంటూ విజయవాడ ప్రభుత్వ దంత వైద్యకళాశాలలో జూనియర్ అసిస్టెంట్ టి సుజాత 2018లో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణలో హైకోర్టు నాటి వైద్య విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య విద్య అప్పటి డైరెక్టరు బాబ్జీ, ప్రభుత్వ దంత వైద్య కళాశాల అప్పటి ప్రిన్సిపల్ మురళీమోహన్‌ను స్వయం విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేసింది. మురళీమోహన్ ఒక్కరే విచారణకు హాజరయ్యారు. మిగిలిన ఇద్దరూ హాజరుకాలేదు.

పొగాకు ఉత్పత్తులు ఆహారం కాదు

ఆహార భద్రత, ప్రమాణాల చట్టం (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎ) కింద గుట్కా, పాన్ మసాలా తదితర పొగాకు ఉత్పత్తులు 'ఆహారమనే నిర్వచన పరిధిలోకి రావని హైకోర్టు తీర్పు చెప్పింది. వాటి తయారీ, నిల్వ, విక్రయం, సరఫరా, పంపిణీ తదితరాలను నిషేధించే అధికారం రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్‌కు లేదంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్ఎస్–ఎస్ఎ కింద పొగాకు ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు తదితరాలను నియంత్రించే అధికారం మాత్రమే కమిషనరుకు ఉందని, నిషేధించే అధికారం లేదని తేల్చి చెప్పింది. పొగాకు, పొగాకు ఉత్పత్తులను నిషేధించేందుకు పార్లమెంటు ప్రత్యక్ష చట్టం ఏదీ రూపకల్పన చేయలేదని చీఫ్ జస్టిస్ పికె మిశ్రా ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

పింఛను వ్యవస్థపై కమిటీ

న్యూఢిల్లీ : కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన ఆర్థిక బిల్లు–2023ని 64 అధికారిక సవరణలతో లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. డెబిట్ మ్యూచువల్ ఫండ్స్‌లోని కొన్ని రకాలపై దీర్ఘకాలిక పన్ను ప్రయోజనాలను ఉపసంహరించుకోవాలని, జిఎస్‌టి కోసం అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలనే సవరణలు వాటిలో ఉన్నాయి. అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటి (జెపిసి) విచారణను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిల నినాదాల మధ్య వాయిస్ ఓటింగ్ ద్వారా ఆర్థిక బిల్లుని ఆమోదించింది.

బిల్లు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదించబడింది. బిల్లును ఆమోదం, పరిశీలన కోసం తరలిస్తున్నప్పుడు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ సమస్యలను పరిశీలించడానికి ఆర్థిక కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీకి ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వం వహిస్తారని అన్నారు. పన్ను నుండి తప్పించుకుని విదేశీ పర్యటనల కోసం క్రెడిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశీలిస్తుందని కూడా ఆమె చెప్పారు. బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ 64 అధికారిక సవరణలను ప్రవేశపెట్టారు.

ఫైనల్‌కు ముంబయి



- వాంగ్ హ్యాట్రిక్, మెరిసిన స్కీవర్
- యుపిపై 72 పరుగుల తేడాతో గెలుపు
- 26న ఢిల్లీతో టైటిల్‌కై ఢీ

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) ఫైనల్లోకి ముంబయి ఇండియన్స్ జట్టు ప్రవేశించింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి జట్టు 72 పరుగుల తేడాతో యుపి వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 182పరుగులు చేయగా.. ఛేదనలో వాంగ్ హ్యాట్రిక్‌తో చెలరేగడంతో యుపి జట్టు 110 పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి పవర్–ప్లే 6ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 46పరుగులు చేసింది. స్కీవర్ బ్రంట్(72నాటౌట్; 38బంతుల్లో 9ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. ఆ తర్వాత మెల్లీ కెర్ర్(29; 19బంతుల్లో 5ఫోర్లు) రాణించడంతో స్కోర్‌బోర్డు పరుగెట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(14) నిరాశపరిచింది. ఎక్లేస్టోన్‌కు రెండు, చోప్రా, శర్వానీకి ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో యుపి జట్టు పవర్‌ప్లే ఓవర్లు ముగిసేసరికే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో నవ్‌గ్రెర్(43; 27బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు) మెరిసినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ నిరాశపరిచారు. వాంగ్ ఒకే ఓవర్‌లో నవ్‌గైర్, సిమ్రన్, ఎక్లేస్టోన్‌లను ఔట్ చేసి హ్యాట్రి నమోదు చేసింది. దీంతో యుపి గెలుపు ఆశలు నీరుగా రాయి. వాంగ్(4/16) బౌలింగ్‌లో మెరిసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వాంగ్‌కు లభించింది. 26న జరిగే ఫైనల్లో టైటిల్‌కై ముంబయి ఇండియన్స్‌జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.



ఆసియా హాకీ ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును యువ క్రీడాకారిణి సలీమ అందుకుంది. కొరియాలోని ముంగ్యోంగ్‌లో జరిగిన ఆసియా హాకీ ఫెడరేషన్(ఎహెచ్ఎఫ్) వార్షిక సర్వసభ్య సమావేశంలో సలీమాకు ఈ అవార్డును అందజేశారు. భారత మహిళల హాకీ జట్టుకు మిడ్‌ఫీల్డర్‌గా ఉన్న 20ఏళ్ల సలీమా.. గత ఏడాది రియో ఒలింపిక్స్‌లో భారతజట్టు సెమీస్‌కు చేరడంలో కీలకపాత్ర పోషించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68